


లండన్‌లో అంబేడ్కర్ నివసించిన భవనంలో పెరియార్, అంబేద్కర్ ఉన్న ఫొటోను ఆసక్తిగా తిలకిస్తున్న స్టాలిన్

మహనీయుల జీవితం..
భావితరాలకు ఆదర్శం

- అంబేడ్కర్ హౌస్, కార్ల్‌మార్క్స్ స్మారక స్థలం సందర్శన
- లండన్‌లో అనుభవాలపై ఎక్స్ పేజీలో వెల్లడించిన సీఎం స్టాలిన్

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విదేశీ పారిశ్రామిక పెట్టుబడుల సమీకరణకోసం లండన్‌లో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ లండన్‌లో చదువుకునే సమయంలో బసచేసిన నివాసాన్ని సందర్శించారు. లండన్ పౌరులు, ప్రముఖుల ప్రశంసలందుకుని భారతదేశంలో అంటరానితనానికి వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించి, భారతరాజ్యాంగాన్ని రచించిన ఆ మహనీయుడి నివాసాన్ని సందర్శించడం తనకు అనిర్వచనీయమైన అనుభూతిని కలిగించిందని స్టాలిన్ తన ఎక్స్‌పేజీలో పేర్కొన్నారు. ఆ నివాసంలోని ఓ గదిలో ద్రవిడ ఉద్యమనేత పెరియార్‌తో అంబేడ్కర్ చర్చిస్తూ నవ్వుతున్న ఫొటోను చూసి ఆశ్చర్యపోయానని తెలిపారు. ఇదే విధంగా ప్రముఖ ఆర్థికవేత్త, సామ్యవాది, 'దాస్ కేపిటల్' రచయిత కార్ల్‌మార్క్స్ సంస్మరణ స్థలాన్ని కూడా ఆయన సందర్శించారు. కార్ల్‌మార్క్స్ సంస్మరణ స్థలాన్ని సందర్శించడం కూడా తనకు వింత అనుభూతిని కలిగించిందని, శ్రామికవర్గాల్లో వెలుగులు నింపిన సూర్యుడు మహామేధావి కార్ల్‌మార్క్స్ అని కొనియాడారు. మార్క్స్ సంస్మరణ స్థూపానికి రెడ్‌సెల్యూట్ చేయడం తనకెంతో గర్వకారణంగా ఉందని స్టాలిన్ పేర్కొన్నారు.

రూ.15,516 కోట్ల పెట్టుబడుల సమీకరణ...

ముఖ్యమంత్రి స్టాలిన్ జర్మన్, ఇంగ్లాండు దేశాల్లో చేసిన పర్యటన విజయవంతమైందని, విదేశీ పెట్టుబడుల సమీకరణ కోసం టీఎన్ రెజింగ్ పేరుతో జరిపిన పెట్టుబడిదారుల సదస్సుల్లో పలు సంస్థలతో అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్నారని శనివారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ రెండు దేశాల్లో పర్యటించి రూ.15,516 కోట్ల మేరకు పారిశ్రామిక పెట్టుబడులు సమీకరించారని, దీంతో రాష్ట్రంలో కొత్త పరిశ్రమల ఏర్పాటు ద్వారా 17, 613 మంది నిరుద్యోగ యువతకు ప్రత్యక్షంగానూ, పరోక్షంగాను ఉపాధి అవకాశాలు కలుగుతాయని ప్రకటించారు. ఈ పర్యటన విజయవంతం కావడానికి రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి టీఆర్‌బీ రాజా, సీఎం ముఖ్య కార్యదర్శి ఉమానాథ్, పారిశ్రామిక పెట్టుబడుల ప్రోత్సాహక శాఖ కార్యదర్శి అరుణ్‌రాయ్, రాష్ట్ర మార్గదర్శక సంస్థ మేనేజింగ్ డైరక్టర్ ధరేస్ అహమ్మద్ సహాయ సహకారాలు అందించినట్లు తెలిపారు.



కార్ల్‌మార్క్స్ స్మారక స్థలం వద్ద నివాళులర్పిస్తున్న ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్

డీఎంకే కూటమి విజయమే లక్ష్యంగా
ప్రచారం చేయండి

- యువజన విభాగ సమావేశంలో ఉదయనిధి



డీఎంకే ప్రాంతీయ కార్యదర్శిని పరిచయం చేస్తున్న ఉదయనిధి

ప్యారీస్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఏడోసారి డీఎంకే ప్రభుత్వాన్ని అధికారంలో కూర్చోబెట్టేలా యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు విస్తృత ప్రచారం చేయాలని డిప్యూటీ సీఎం ఉదయనిధి సూచించారు. చెన్నై పశ్చిమ జిల్లా పరిధిలోని హార్బర్, ఎగ్మూర్, విల్లివాక్కం నియోజకవర్గాలకు కొత్తగా నియమించిన డీఎంకే యువజన విభాగం నిర్వాహకులు, ఎన్నికల ప్రచారానికి ఎంపిక చేసిన నేతల పరిచయ కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సమావేశంలో ఉదయనిధి మాట్లాడుతూ, రాష్ట్ర అసెంబ్లీలోని 234 నియోజకవర్గాల్లో 200 స్థానాల్లో డీఎంకే కూటమి విజయం కోసం ప్రతి కార్యకర్త రాబోయే ఆరు నెలలు ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని, సీఎం స్టాలిన్ నెరవేర్చిన హామీల వివరాలను కరపత్రాల్లో ముద్రించి పంపిణీ చేయాలని సూచించారు. పార్టీకి అనుకూలంగా ఉన్న నియోజకవర్గాలు ఎట్టిపరిస్థితుల్లోనూ చేయి జారిపోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత కార్యకర్తలదేనన్నారు. ఈ సమావేశంలో ఎంపీ దయానిధి మారన్, ఎమ్మెల్యేలు తాయగంకవి, పరంధామన్, వెట్రిఅలగన్, ప్రాంతీయ కార్యదర్శులు ఎస్.మురళి, రాజశేఖర్, వాసు, సుధాకర్, జిల్లా అధ్యక్షుడు, మంత్రి పీకే.శేఖర్‌బాబు, మహిళా, కార్మిక విభాగం నిర్వాహకులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి సెంగోట్టయ్యన్‌పై వేటు

- అల్టిమేటం ఇచ్చిన 24 గంటల్లోనే ఈపీఎస్ చర్య



ఎడప్పాడి పళనిస్వామి - సెంగోట్టయ్యన్

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అవిభక్త అన్నాడీఎంకే తన లక్ష్యమని, పార్టీ నుండి దూరమైన అన్ని వర్గాలను పది రోజుల్లోగా ఏకతాటిపైకి తెచ్చేలా చర్యలు తీసుకోవాలంటూ ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్)కు అల్టిమేటం జారీ చేసిన పార్టీ సీనియర్ నేత సెంగోట్టయ్యన్‌పై వేటు పడింది. పార్టీ పదవుల నుంచి ఆయన్ని తక్షణమే తొలగిస్తున్నట్లు ప్రకటించడమే కాకుండా వెంటనే ఆ పదవుల్లో కొత్తవారిని నియమిస్తూ ఈపీఎస్ సంచలనాత్మకమైన నిర్ణయం తీసుకున్నారు. సెంగోట్టయ్యన్‌ను మాత్రమే గాక ఆయన అనుచరులను కూడా పార్టీ పదవుల నుండి తొలగించారు. ఏడాదికి పైగా ఈపీఎస్ తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసిన సెంగోట్టయ్యన్ శుక్రవారం ఉదయం గోపిచెట్టి పాళయంలో మీడియా సమావేశంలో అన్ని వర్గాలను ఏకం చేస్తేనే వచ్చే యేడాది అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే ఘనవిజయం సాధిస్తుందని, ఆ దిశగా చర్యలు తీసుకునేందుకు ఈపీఎస్‌కు పది రోజులు గడువు విధించారు. సెంగోట్టయ్యన్ చేసిన ఈ ప్రకటన ఈపీఎస్, ఆయన అనుచరులు, మద్దతుదారులకు ఆగ్రహం కలిగించింది. సెంగోట్టయ్యన్ చేసిన అల్టిమేటమ్‌పై శనివారం ఉదయం దిండుగల్‌లో మాజీ మంత్రులు వేలుమణి, నత్తం విశ్వనాథన్, కేపీ మునుసామి తదితర నాయకులతో ఈపీఎస్ సమావేశమయ్యారు. పార్టీ అధిష్ఠానంపైనే తిరుగుబాటు చేసేలా సెంగోట్టయ్యన్ ప్రకటన చేశారని, ఆయనను పార్టీ పదవుల నుండి తొలగించడమే సముచితమని సీనియర్ నేతలంతా ఈపీఎస్‌కు సూచించారు. దీంతో సెంగోట్టయ్యన్ నిర్వర్తిస్తున్న పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి పదవి నుంచి, పార్టీ ఈరోడ్ సబర్బన్ సౌత్ జిల్లా పదవినుండి తక్షణమే తొలగిస్తునట్లు ప్రటించారు. ఇదే విధంగా సెంగోట్టయ్యన్ అనుచరులు అన్నాడీఎంకే ఈరోడ్ సబర్బన్ వెస్ట్ జిల్లా కార్యదర్శి తండి అలియాస్ కేపీ సుబ్రమణియన్, నంబియూరు సౌత్ కార్యదర్శి ఎం. ఈశ్వరమూర్తి అలియాస్ చెన్నై మణిని ఆ పదవులనుండి తక్షణమే తొలగించినట్లు ప్రకటించారు. ఇక సెంగోట్టయ్యన్ నిర్వహించే ఈరోడ్ సబర్బన్ వెస్ట్ జిల్లా పార్టీ కార్యదర్శి బాధ్యతలను పార్టీ శాసనసభ్యుడు, పార్టీ వ్యవస్థాపక కార్యదర్శి సెల్వరాజ్ నిర్వహిస్తారని ఈపీఎస్ ప్రకటించారు.

సంజాయిషీ అడక్కుండా తొలగింపా?: సెంగోట్టయ్యన్

పార్టీ పదవుల నుండి తొలగించడంపై మాజీ మంత్రి సెంగోట్టయ్యన్ స్పందిస్తూ అన్నాడీఎంకే ఘనవిజయం సాధించాలంటే విడిపోయిన అన్ని వర్గాలను ఏకం చేయాలని కోరుకోవడం తప్పుకాదని, ఇది పార్టీ క్రమశిక్షణ ఉల్లఘించడం కాదన్నారు. అన్ని వర్గాలను పది రోజుల్లోగా విలీనం చేసేలా చర్యలు చేపట్టాలని మాత్రమే డిమాండ్ చేశానని చెప్పారు. ప్రజస్వామ్య పద్ధతి ప్రకారం పార్టీ పదవులనుండి తనను తొగించడానికి ముందు సంజాయిషీ కోరివుంటే బాగుండేదన్నారు. తనను పార్టీ పదవుల నుండి తొలగించిన వారికి కాలమే తగిన గుణపాఠం చెబుతుందన్నారు. ఏది ఏమైనప్పటికీ విడిపోయినవారిని కలిపే దిశగా తాను చర్యలు చేపడుతూనే ఉంటానని, అవిభక్త అన్నాడీఎంకే సాధించి తీరుతానని ఆయన శపథం చేశారు.

18 నుంచి పుదుచ్చేరి
అసెంబ్లీ సమావేశాలు



పుదుచ్చేరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత పుదుచ్చేరి రాష్ట్ర అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 18వ తేదీ ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయని స్పీకర్ యేంబళం సెల్వం ప్రకటించారు. 15వ పుదుచ్చేరి బడ్జెట్ సమావేశాలు మార్చి 10న గవర్నర్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. 12న ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి దాఖలు చేసిన బడ్జెట్‌పై వరుసగా 13రోజులు పాటు చర్చలు కొనసాగగా, 27న పుదుచ్చేరికి రాష్ట్రస్థాయి హోదా కల్పించాలని తీర్మానం ఆమోదించిన ప్రభుత్వం ఆ రోజుతో బడ్జెట్ సమావేశాలను పూర్తిచేసింది. ఈ నేపథ్యంలో 18వ తేదీ గురువారం పుదుచ్చేరి అసెంబ్లీ సమావేశం ప్రారంభమవుతుంది. ఇందులో అసెంబ్లీ ముందుకు తీసుకురావాల్సిన చట్టసవరణ, కొత్త చట్టాలు, అభివృద్ధి పథకాలకు సంబంధించి ఆయా శాఖల తరుఫున దాఖలు చేసే ప్రతిపాదనలపై చర్చ జరుగుతాయి. కాగా, ఈ సమావేశాలు ఎన్నిరోజులు జరగాలన్న దానిపై సభా వ్యవహారాల మండలి సమావేశమై నిర్ణయం తీసుకుంటుంది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో పరిశ్రమలు ప్రారంభించేలా ముసాయిదా చట్టం, జీఎస్టీ, రెండో చట్టసవరణ బిల్లులు దాఖలవుతాయని స్పీకర్ శనివారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు.

ఆ వినతులు బుట్టదాఖలే

- 'ఉంగళుడన్ స్టాలిన్'పై ఎడప్పాడి విమర్శలు

ప్యారీస్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): డీఎంకే ప్రభుత్వం ప్రచార ఆర్భాటాల కోసం నిర్వహించే 'ఉంగళుడన్ స్టాలిన్' శిబిరాల్లో ప్రజల నుండి స్వీకరించే వినతిపత్రాలు బుట్టదాఖలవుతున్నాయని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ఎద్దేవా చేశారు. 'మక్కలై కాప్పోం-తమిళగత్తై మీడ్పోం' అనే నినాదంతో జూలై 7వ తేదీన కోవైలో ప్రారంభించిన ఈపీఎస్ ప్రచారయాత్ర తేని జిల్లాలోని కంబం, బోడినాయకనూర్ ప్రాంతాలకు శనివారం చేరుకుంది. ఈ సందర్భంగా ఈపీఎస్ మాట్లాడుతూ నీట్‌ను రద్దుచేయిస్తామని నాటకమాడిన డీఎంకే నేతలు సుమారు కోటి మంది వద్ద సంతకాలు సేకరించి సేలంలో జరిగిన మహానాడులో ముఖ్యమంత్రి స్టాలిన్‌కి అప్పగించారని, ఆ జాబితా ఎక్కడుందో ఎవరికీ తెలియదన్నారు. ఉంగళుడన్ స్టాలిన్ శిబిరాల్లో ప్రజలనుండి స్వీకరిస్తున్న వినతిపత్రాలను సంబంధిత అధికారులు పరిశీలించకుండా చెత్తకుండీలు, సరస్సులు, మురికి కాలువల్లో పడేస్తున్నారని, ఈ కాగితాలు టిఫిన్ దుకాణాల్లో చిరుతిండ్లు పొట్లాలు కట్టేందుకు ఉపయోగిస్తున్నారని ఈపీఎస్ విమర్శించారు. రోజురోజుకు బలం పుంజుకుంటున్న అన్నాడీఎంకేను నాశనం చేసేందుకు ఎంతో మంది చేస్తున్న కుట్రలను ప్రజలు గమనిస్తున్నారన్నారు.

వామ్మో.... ఎన్ని కట్ల పాములో...!

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తంజావూరులో ఓ ఇంట్లో భారీగా కట్ల పాము లు కనిపించాయి. ఓ బ్యాంకు ఉద్యోగి, తన ఇంట్లో పాము తిరుగుతుందని పాములు పట్టే వారికి సమాచారం ఇచ్చాడు. వారు అక్కడకు చేరుకుని ఇంటి ప్రాంగణంలో టైల్స్ దెబ్బతిన్న ప్రాంతంలో తవ్వి చూసి దిగ్భ్రాంతి చెందారు. అక్కడ పెద్ద పాము సహా 14 చిన్న పాములను గమనించి వాటిని బంధించారు. వాటిని అడవిలో విడిచిపెట్టనున్నట్లు తెలిపారు.

14 పిల్లలతో కట్ల పాము



ఐసీయూలోనే నల్లకన్ను

- రెండు వారాలుగా కొనసాగుతున్న చికిత్స

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సీపీఐ సీనియర్ నాయకుడు నల్లకన్నుకు స్థానిక రాజీవ్‌గాంధీ స్మారక సర్వజన ఆసుపత్రి (జీహెచ్)లోని అత్యవసర చికిత్సా విభాగంలో వైద్యం అందిస్తున్నారు. ఆగస్టు 22న తన నివాసంలో ఆయన కాలుజారి నేలపై పడటంతో తలకు బలమైన గాయాలు తగిలాయి. వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఆ తరువాత మెరుగైన చికిత్స కోసం జీహెచ్‌కు తరలించారు. అదే సమయంలో ఆయనకు శ్వాసకోశ సమస్యలు కూడా రావటంతో వైద్యనిపుణులు దానికి తగిన చికిత్స ప్రారంభించారు. నల్లకన్ను జీహెచ్‌లో చేరి రెండువారాలు దాటినా. ఇంకా ఆయనను అత్యవసర చికిత్సా విభాగంలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. ఈ విషయమై డీన్ శాంతారామన్ మాట్లాడుతూ నల్లకన్ను వయస్సు వందేళ్లు దాటిందని, వృద్ధాప్య సమస్యల కారణంగా ఆరోగ్యపరమైన ఇబ్బందులు రావటం సహజమేనని చెప్పారు. ఆయన ఆరోగ్యం వేగంగా పుంజుకునే అవకాశం లేదని, నెమ్మదిగానే కోలుకుంటారని చెప్పారు. అత్యవసర చికిత్సా విభాగంలోని మరికొద్ది రోజులపాటు ఆయనకు చికిత్స కొనసాగించాల్సి ఉందన్నారు.

జీహెచ్‌లో చికిత్స పొందుతున్న సీపీఐ నేత నల్లకన్ను



కూటమిని నడిపించే సత్తా
నాగేంద్రన్‌కు లేదు

టీటీవీ దినకరన్



మీడియాతో మాట్లాడుతున్న దినకరన్

ప్యారీస్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమిళనాడులో ఎన్డీయే కూటమిని ఎలా నడిపించాలో అర్థంకాక బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ సతమతమవుతున్నారని అమ్మా మక్కల్ మున్నేట్ర కళగం (ఏఎంఎంకే)ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ పేర్కొన్నారు. మదురైలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, వచ్చే ఏడాది అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో మెజారిటీ సీట్లలో గెలిచే కూటమిలో ఏఎంఎంకే ఉంటుందన్నారు. బీజేపీ రాష్ట్రఅధ్యక్షుడిగా అన్నామలై ఉన్నంత వరకు ఎన్డీయే కూటమి ఐక్యతతో ముందుకుసాగిందని, అందుకే మాజీ సీఎం ఓ.పన్నీర్‌సెల్వం వర్గం, ఏఎంఎంకేలు కూటమిలో కొనసాగాయని వివరించారు. అయితే ఇటీవల రాష్ట్రంలో పర్యటించేందుకు వచ్చిన ప్రధాని నరేంద్రమోదీని కలిసేందుకు ఓపీఎస్‌కు అవకాశం ఇవ్వకుండా చిన్నబుచ్చారని, అందువల్లే ఓపీఎస్ ఎన్డీయే కూటమి నుండి బయటికొచ్చారన్నారు. అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామిని తాము సోదరుడిగానే చూస్తున్నామని, ఆయనతో వ్యక్తిగతంగా ఎలాంటి విభేదాలు లేవని, అన్నాడీఎంకేలో చీలిన వర్గాలను మళ్లీ విలీనం చేసేందుకు కేంద్రమంత్రి అమిత్‌షా ప్రయత్నిస్తున్నారని, అవసరమైతే ఢిల్లీ వెళ్లి బీజేపీ పెద్దలను సంప్రదిస్తానని దినకరన్ తెలిపారు.

46 మంది స్టేషన్ అధికారులకు సీఎం పురస్కారాలు

- ప్రదానం చేసిన ఇన్‌ఛార్జ్ డీజీపీ వెంకట్రామన్



పురస్కారాలు అందుకున్న అధికారులతో ఇన్‌చార్జ్ డీజీపీ వెంకట్రామన్

పెరంబూర్, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి) రాష్ట్రంలో తొలి పోలీసు దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యమంత్రి స్టాలిన్ ఏప్రిల్ 29న జరిగిన బడ్జెట్ సమావేశాల్లో, 1859లో మద్రాసు జిల్లా పోలీసు చట్టం ఆమోదింపడిన తర్వాత సెప్టెంరు 6న తొలిసారిగా ఆధునిక, వ్యవస్థీకృత పోలీసు దళం స్థాపించబడిందని, ప్రతి ఏడాది ఆ రోజు (సెప్టెంబరు 6వ తేది) పోలీసు దినోత్సవం జరుకుంటామని ప్రకటించారు. ఆ ప్రకారం, రాష్ట్ర తొలి పోలీసు దినోత్సవం శనివారం అన్ని పోలీసు స్టేషన్లలో నిర్వహించారు. ప్రతిజ్ఞ, అమరులైన పోలీసులకు నివాళి, పోలీసుల కార్యకలాపాలు ప్రజలకు తెలియజేయడం, పోలీసు కుటుంబాలు, స్వచ్ఛంధ సంస్థలతో కలసి సాంస్కృతిక కార్యక్రమాలు సహా వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవలందించిన 46 పోలీసు స్టేషన్ల అధికారులకు ముఖ్యమంత్రి పురస్కారాలను ఇన్‌ఛార్జ్ డీజీపీ వెంకట్రామన్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డీజీపీ పోలీసు దినోత్సవం ప్రాముఖ్యత వివరించారు. భయం, పక్షపాతం లేకుండా ప్రజలకు సేవలు అందించాలని ఆయన పిలుపునిచ్చారు.

సమాచార దర్శిని

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మార్గాల్లో మరమ్మతుల కారణంగా అడయార్ పరిధి లోని పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగనుంది. శ్రీనివాసమూర్తి అవెన్యూ, ఎల్బీ రోడ్డు, తిరువేంగడం వీధి, కేబీ నగర్ 1వ క్రాస్ వీధి, అన్నా అవెన్యూ, లోకనాధచెట్టి గార్డెన్, బలరామ్ రోడ్డు, కన్నియమ్మ గార్డన్, కెనాల్ బ్యాంక్ రోడ్డు, గాంధీ నగర్, మెయిన్ రోడ్డు, కెనాల్ క్రాస్ రోడ్డు తదితర ప్రాంతాల్లో సోమవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ బోర్డు ఒక ప్రకటనలో తెలిపింది.

నాదస్వర పాఠశాలలో అడ్మిషన్లు

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డోలు, నాదస్వర శిక్షణా పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆలయ జాయింట్ కమిషనర్ రమణి ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి కలిగిన వారు https://hree.tn.gov.in, tiruttani murugan. hree.tn.gov.in అనే వెబ్‌సైట్‌లలో దరఖాస్తు చేసుకోవచ్చని కమిషనర్ తెలిపారు.

రేపటి నుంచి సిద్ధ వైద్య, ఆయుర్వేద కోర్సుల కౌన్సెలింగ్

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సిద్ధ వైద్య, ఆయుర్వేద, యునానీ కోర్సుల అడ్మిషన్లకు సంబంధించిన ర్యాంకుల జాబితా శుక్రవారం విడుదల చేశారు. ప్రభుత్వ కోటా సీట్ల ర్యాంకుల జాబితాలో, 4,371 మంది అర్హత సాధించారు. 'నీట్‌లో 720కు 520 మార్కులు సాధించి కన్నియాకుమారి జిల్లాకు చెందిన విద్యార్థిని టీఎస్ ప్రగతి ప్రథమ స్థానం పొందారు. అలాగే, నీట్‌లో 512 మార్కులు పొందిన జీటీ ఇనియ సుదర్శన్, 509 మార్కులు సాధించి ఆర్.పావేష్ తదితరులు తదుపరి స్థానాల్లో నిలిచారు. ప్లస్ టూ మార్కుల ఆధారంగా సిద్ధ, ప్రకృతి వైద్య కోర్సుల ర్యాంకుల జాబితా విడుదల చేశారు. ఈ కోర్సుల అడ్మిషన్ కౌన్సెలింగ్ https://tnayushselection.org అనే వెబ్‌సైట్‌లో, ఈ నెల 8వ తేది ఉదయం 10కిప్రారంభమై, 11వ తేది సాయంత్రం 5 గంటల వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

విమానాశ్రయ డైరెక్టర్‌గా రాజా కిషోర్

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై విమానాశ్రయ డైరెక్టర్‌గా ఎం.రాజా కిషోర్ నియమితులయ్యారు. ఈ విమానాశ్రయ డైరెక్టర్‌గా 2023 జూన్ నెల నుంచి పనిచేస్తున్న సీవీ దీపక్ ఢిల్లీకి బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఈశాన్య రాష్ట్రాల విమానాశ్రయ అథారిటీ ప్రాంతీయ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న రాజా కిషోర్ నియమితులయ్యారు. ఆంధ్ర ప్రదేశ్‌కు చెందిన రాజా కిషోర్ తిరుపతి విమానాశ్రయంలో సమర్థవంతంగా పనిచేశారు.

చిరుధాన్యాల ఆహార తయారీపై శిక్షణ

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని తమిళనాడు వ్యవసాయ విశ్వవిద్యాలయ శిక్షణా కేంద్రంలో ఈ నెల 11న చిరుధాన్యాల ఆహార పదార్థాల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. చిరుధాన్యాలతో పోషకమైన పిండి, ఇడ్లీ మిక్స్, లడ్డూ సహా పలు పదార్థాల తయారీపై శిక్షణ ఇవ్వనున్నారు. అలాగే, 12న పండ్లు, కూరగాయలు సేంద్రియ సాగుపై శిక్షణ ఇవ్వనున్నారు. వివరాలకు 044-29530048, 29530049 అనే నెంబర్లు సంప్రదించవచ్చు.

మెట్రో రైళ్ల వేళల్లో మార్పు

● సీఎంఆర్ఎల్ ప్రకటన

ప్యారీస్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9 నుండి 19వ తేదీ వరకు రైలుపట్టాల మరమ్మతుల కారణంగా మెట్రో రైళ్ల వేళల్లో మార్పు చేస్తున్నట్లు చెన్నై మెట్రో రైల్వే లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) ప్రకటించింది. ఈ మేరకు శనివారం విడుదల చేసిన ప్రకటనలో నగరంలో మెట్రో రైళ్లు నడుపుతున్న గ్రీన్‌లైన్, బ్లూలైన్ మార్గాల్లో భద్రత పటిష్ట పరిచేలా సంవత్సరంలో 10 రోజులు మరమ్మతు చేయడం ఆనవాయితీ. ఈ ఏడాది ఈ నెల 9 నుండి 19వ తేదీ నుండి ఉదయం 5 నుంచి సాయంత్రం 6 గంటల వరకు నడపనున్న మెట్రో రైళ్ల వేళల్లో మార్పు చేశారు. మెట్రో రైళ్లు ఉదయం 5 నుండి 6.30 గంటల వరకు ప్రస్తుతం కొనసాగుతున్న విశ్రాంతి సమయం 7 నిమిషాలకు బదులుగా 14 నిమిషాల ఆలస్యంగా బయలుదేరుతాయి. ఉదయం 6.30 తర్వాత మెట్రోరైళ్ల వేళల్లో ఎలాంటి మార్పులు లేకుండా యథావిధిగా ఉంటాయి. ప్రయాణికులంతా మార్పు చేసిన సమయ వివరాలను సీఎంఆర్ఎల్ మొబైల్ యాప్, వెబ్‌సైట్ ద్వారా గానీ, 1860-425-1515 అనే నెంబర్‌లను సంప్రదించి తెలుసుకోవచ్చు.

నాలుగేళ్లలో రూ.276 కోట్లతో 12 వంతెనలు

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కార్పొరేషన్ పరిధిలో ట్రాఫిక్ రద్దీ నియంత్రించేలా రూ.276.75 కోట్లతో 12 కొత్త వంతెనలు నిర్మించారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ విడుదల చేసిన ప్రకటనలో... జీసీసీ పరిధిలో నాలుగేళ్లలో రూ.276.75 కోట్లతో కొళత్తూర్-విల్లివాక్కం రైల్వే జంక్షన్‌లో మేయర్ చిట్టిబాబు వంతెన, స్టీఫన్‌సన్ రోడ్డులో సెంగై శివన్ వంతెన, ఎలిఫెంట్ గేట్ వంతెన సహా 12 కొత్త వంతెనలు నిర్మించారు. అలాగే, రూ.6.92 కోట్లతో ఎంకేబీ నగర్ వంతెన, వైద్యనాథన్ వంతెన నిర్మాణపనులు వివిధ దశల్లో కొనసాగుతున్నాయని జీసీసీ తెలిపింది.

సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూర్ ప్రభుత్వ వైద్యకళాశాలలో సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... తిరువళ్లూర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో 2025-26 విద్యా సంవత్సరానికి వైద్య సర్టిఫికెట్ కోర్సుల్లో అడ్మిషన్లు జరుగుతాయన్నారు. అనస్తీషియా, ఆపరేషన్ థియేటర్, డయాలసిస్, ఆర్థోపెడిక్ టెక్నీషియన్, మల్టీడిసిప్లనరీ మెడికల్ సర్వీస్ కోర్సుల్లో 64 ఖాళీలున్నాయని, ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 8 నుంచి 12వ తేది వరకు దరఖాస్తులు పొంది, పూర్తిచేసి ఈ నెల 17వ తేదిలోగా కళాశాల ప్రిన్సిపాల్, ఉప ప్రిన్సిపాల్ కార్యాలయాల్లో సమర్పించాలని తెలిపారు. మరిన్ని వివరాలకు gmcthiruvallur@gmail.com అనే ఈ-మెయిల్, 044-27665029 అనే నెంబరు సంప్రదించాలని కలెక్టర్ తెలిపారు.

డీజీపీ ఆఫీసు ఎదుట

పురట్చి తమిళగం నేతపై డీపీఐ కార్యకర్తల దాడి




మూర్తిపై దాడి చేస్తున్న డీపీఐ కార్యకర్తలు, చినిగిన చొక్కాతో వెళ్తున్న ఎయిర్‌పోర్ట్ మూర్తి

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలోని డీజీపీ కార్యాలయం వద్ద శనివారం ఉదయం పురట్చి తమిళగం, డీపీఐ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరిగాయి. ఈ సంఘటనలో పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌కు అత్యంత సన్నిహితుడు, పురట్చి తమిళగం నేత ఎం.ఆర్ పోర్ట్ మూర్తి తీవ్రంగా గాయపడ్డారు. పీఎంకే వ్యవస్థాపకుడు డాక్టర్ రాందాస్‌కు పటిష్టమైన భద్రత కల్పించాలంటూ డీజీపీ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించేందుకు ఎయిర్‌పోర్ట్ మూర్తి తన అనుచరులతో కలిసి వెళ్తుండగా అదే సమయంలో ఆ ప్రాంతానికి చేరుకున్న డీపీఐకి చెందిన నలుగురు వారిపై చెప్పులు విసిరారు. దీనితో ఆగ్రహం చెందిన ఎయర్‌పోర్ట్ మూర్తి అనుచరులు డీపీఐ కార్యకర్తలపై దాడికి దిగారు. ఈ ఘర్షణలో ఎయిర్‌పోర్ట్ మూర్తికికి తీవ్ర గాయాలయ్యాయి. ఆయన చొక్క చినిగింది. డీజీపీ కార్యాలయం వద్ద పోలీసులు చూస్తుండగా రెండు పార్టీల కార్యకర్తలు పరస్పరం దాడికి దిగారు. ఈ విషయమై ఎయిర్‌పోర్ట్ మూర్తి మడియాతో మాట్లాడుతూ కేంద్రం విడుదల చేసిన ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ నిధులను ఖర్చుపెట్టకుండా ప్రభుత్వం తిప్పి పంపిందని, ఈ విషయంపై శాసనసభలో డీపీఐ శాసనసభ్యులంతా మౌనం పాటించారంటూ తాను విమర్శించినందున డీపీఐ కార్యకర్తలు ఓ పథకం ప్రకారం తనపై దాడికి దిగారని ఆయన ఆరోపించారు. డీపీఐ కార్యకర్తలు తనపై ఎన్నేమార్లు దాడులు జరిపారని, పోలీసులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడం లేదని, శనివారం జరిగిన ఘర్షణకు సంబంధించి కూడా తాను పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదని ఆయన అన్నారు.

నేడు 11 సబర్బన్ రైళ్ల రద్దు

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-గూడూరు సెక్షన్ పరిధిలోని పొన్నేరి యార్డులో మరమ్మతుల కారణంగా ఆదివారం రాత్రి 8 నుంచి సోమవారం వేకువజామున 4 గంటల వరకు 11 సబర్బన్ రైళ్లు రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది.

● చెన్నై బీచ్ నుంచి గుమ్మిడిపూండికి సాయంత్రం 6.45, రాత్రి 8, 9.20 గంటల సబర్బన్ రైళ్లు రద్దు

● మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి గుమ్మిడిపూండికి సాయంత్రం 6.35, రాత్రి 11.20 గంటల రైళ్లు రద్దు

● గుమ్మిడిపూండి నుంచి చెన్నై బీచ్‌కి సాయంత్రం 6.35, రాత్రి 8.35 గంటల రైళ్ల రద్దు

● గుమ్మిడిపూండి నుంచి మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు రాత్రి 8.15, 9.25, 10.30 గంటల రైళ్ల రద్దు

●సూళ్లూరుపేట నుంచి మూర్ మార్కెట్ కాంప్లెక్ రాత్రి 8.35 రైలు రద్దు

ప్రత్యేక రైళ్లు...

ప్రయాణికుల సౌకార్యర్థం చెన్నై బీచ్ నుంచి మీంజూరుకు సాయంత్రం 6.45, 9.20 గంటలు, మూర్ మార్కెట్ కాంప్లెక్స్ నుంచి మీంజూరుకు సాయంత్రం 7.35 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు. అలాగే, మీంజూరు నుంచి చెన్నై బీచ్‌కి రాత్రి 8.04, మూర్ మార్కెట్ కాంప్లెక్స్‌కు రాత్రి 8.44, 9.56 గంటలు, సూళ్లూరుపేట నుంచి గుమ్మిడిపూండికి రాత్రి 8.35 గంటలకు ప్రత్యేక రైళ్లు నడుపనున్నారు.

దర్శనానికి దళితులను అనుమతించండి : హైకోర్టు

ప్యారీస్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా పుత్తగరం గ్రామంలోని ముత్తుకొలిక్కియమ్మన్ ఆలయంలోకి దళితులను అనుమతించాల్సిందేనని మద్రాస్ హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. జిల్లాలోని వాలజాబాద్ సమీపంలోని పుత్తగరం గ్రామానికి చెందిన సెల్వరాజ్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌లో, ఆ గ్రామంలో అమ్మవారి ఆలయం లోపలికి దళిత వర్గానికి చెందిన తమను అనుమతించడంలేదని, ప్రభుత్వం పలుమార్లు చర్చల ద్వారా ఈ సమస్యను పరిష్కరించినప్పటికీ ఇతర కులాల వారికిమద్దతుగా హిందూ దేవాదాయశాఖ అధికారులు వ్యవహరిస్తున్నారని తెలిపారు. దళిత వాడల ప్రజలను దీపారాధన సమయంలో ఆలయం బయటే నిలబెడుతున్నారని, అభిషేకం, అర్చన, విశేషపూజలకు అనుమతించడంలేదని తెలిపారు. అంతేకాకుండా అమ్మవారిని రథంలో ఊరేగిస్తున్న సమయంలో రథం దళిత వాడల వైపు రాకుండా అడ్డుకుంటున్నారని, దైవారాధనలో పాల్గొనే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని హిందూ దేవాదాయశాఖను ఆదేశించాలని పిటిషనర్ న్యాయస్థానాన్ని అభ్యర్థించారు. ఈ పిటిషన్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎస్.దండపాణి ధర్మాసనం ముందుకు విచారణకు రాగా, పిటిషనర్ తరుపున హాజరైన న్యాయవాది పారవేందర్ దళిత వర్గాలకు అమ్మవారిని సేవించే అవకాశం కల్పించాలని కోరారు. ఇరుతరుపు వాదనలు విన్న అనంతరం గ్రామంలో ఇరువర్గాల మధ్య ఉన్న సమస్యను పరిష్కరించేలా అన్ని వర్గాలకు చెందినవారిని అమ్మవారి పూజల్లో పాల్గొనేలా చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్, హిందూ దేవాదాయశాఖ అధికారులను ఆదేశించిన న్యాయమూర్తి ఈ కేసు తదుపరి విచారణను ఈ నెల 15కు వాయిదా వేశారు.

11న ఇమ్మానుయేల్ శేఖరన్ వర్ధంతి

● నివాళులర్పించేందుకు నిబంధనలు



కలెక్టర్ రంజిత్‌సింగ్ కహ్లోన్

ప్యారీస్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రామనాథపురం జిల్లా పరమకుడిలో ఈ నెల 11వ తేదీ స్వాతంత్ర సమరయోధుడు 'ఇమ్మానుయేల్ శేఖరన్' వర్ధంతిని పురస్కరించుకుని నివాళులర్పించేందుకు నిబంధనలు విధించినట్లు కలెక్టర్ రంజిత్ సింగ్ కహ్లోన్ పేర్కొన్నారు. ప్రతిఏటా ఇమ్మానుయేల్ శేఖరన్ వర్ధంతిని పురస్కరించుకుని పరమకుడిలోని ఆయన స్మారక స్థూపం వద్ద నివాళులర్పించేందుకు రాజకీయ పార్టీల కార్యకర్తలు తరలివెళుతుంటారు. ఆ విధంగా కొన్నేళ్ల క్రితం నివాళులర్పించేందుకు వెళ్లిన రెండు వర్గాల మధ్య జరిగిన ఘర్షణల కారణంగా ప్రభుత్వ, ప్రైవేటు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఇందువల్ల ఈ సారి వర్ధంతి కార్యక్రమంలో పాల్గొనేందుకు కట్టుబాట్లు విధించారు. దీనిపై శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ రంజిత్‌సింగ్ కహ్లోన్ అధ్యక్షత జరిగిన సమావేశంలో ప్రభుత్వ అధికారులు, కులసంఘాల ప్రతినిధులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సమావేశం ఆమోదించిన తీర్మానం ప్రకారం నివాళులర్పించేందుకు వచ్చేవారు సొంత వాహనాల్లో మాత్రమే రావాలని, అద్దెవాహనాలు, టాపులేని వాహనాలు, ద్విచక్రవాహనాలు, టాటా ఏసీ, ఆటోలు, సైకిళ్లకు అనుమతిలేదని సమావేశం అనంతరం కలెక్టర్ మీడియాకు వివరించారు. సొంత వాహనాల్లో వచ్చేవారు ఆ వాహనం రిజిస్ట్రేషన్ నెంబర్ సర్టిఫికెట్లు, డ్రైవర్ లైసెన్సు, ప్రయాణం చేసే వారి పూర్తి వివరాలతో జాబితాలను రామనాథపురం జిల్లా డీఎస్పీ కార్యాలయంలో సమర్పించి అనుమతి పొందాల్సివుంటుందన్నారు. అనుమతి లేని వాహనాలు అనుమతించబోమని, ఘర్షణలకు చోటివ్వకుండా ప్రజలు సహకరించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

మదురై, తూత్తుకుడి, తిరుచ్చిలకు 'ఎయిర్ బస్' విమానాలు

● కేంద్ర ప్రభుత్వానికి మంత్రి సుబ్రమణ్యం లేఖ

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజధాని నగరం చెన్నై నుంచి మదురై, తిరుచ్చి, తూత్తుకుడి తదితర ప్రాంతాలకు 'ఎయిర్ బస్' రకం విమానాలు నడపాలని కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడికి రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి ఎం.సుబ్రమణ్యం లేఖ రాశారు. ముఖ్యంగా, చెన్నై నుంచి మదురై వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. ఈ మేరకు మంత్రి సుబ్రమణ్యం రాసిన లేఖలో... ఈ మార్గంలో ప్రస్తుతం 'ఏటీఆర్' రకం విమానాలు నడుపుతున్నారని, ఈ విమానాలను టెర్మినల్ భవనం నుంచి చాలా దూరంలో నిలుపుతున్నారని, ప్రయాణికులను ఆ విమానాల వరకు బస్సుల్లో తరలిస్తున్నారని తెలిపారు. ఆ బస్సుల్లో తక్కువ సీట్లు ఉండడంతో, పిల్లలు, మహిళలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పార్కింగ్ ఫీజు తగ్గించేందుకు విమానాలు దూరంగా నిలుపుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారన్నారు. ఈ సమస్యపై స్పందించి, టెర్మినల్ సమీపంలో మదురైకి వెళ్లే ఏటీఆర్ విమానాలు పార్క్ చేసేలా, నగరం నుంచి రాష్ట్రంలోని ఇతర నగరాలకు ఎయిర్ బస్ రకం విమానాలు నడపాలని కేంద్ర ప్రభుత్వానికి మంత్రి సుబ్రమణ్యం విజ్ఞప్తిచేశారు.

తిరుత్తణి సమీపంలో కారు దగ్ధం

● డ్రైవర్‌కు గాయాలు



తిరుత్తణి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సమీపంలోని పింజనూర్ రహదారిలో వెళుతున్న ఓ కారు ప్రమాదానికి గురై దగ్ధమైంది. వివరాలిలా... తిరువలంగాడుకు చెందిన నాగరాజ్ తిరుత్తణికి వెళ్తుండగా, మార్గమధ్యలో పింజనూర్ రహదారిలోకి రాగానే కారునుండి పొగలు రావటంతో ఆ గ్రామ శివారు ప్రాంతంలో డ్రైవర్ కారు ఆపేశారు. గమనించిన గ్రామస్తులు డ్రైవర్‌ను రక్షించి, కారుపై నీళ్లు చల్లి మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కారు 90శాతం కాలిపోయింది. విషయం తెలుసుకున్న తిరువలంగాడు పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని దీనిపై కేసు నమోదు చేసి దగ్ధమైన కారును పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ప్రభుత్వ పాఠశాలలకు బ్రాండ్ అంబాసిడర్లు

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ విద్యార్థులను బ్రాండ్ అంబాసిడర్లుగా నియమించే గడువు ఈ నెల 23వ తేది వరకు పొడిగించారు. ఈ విషయమై పాఠశాల విద్య డైరెక్టరేట్ విడుదల చేసిన ప్రకటనలో... సామాజిక, సేవా భావం కలిగిన పూర్వ విద్యార్థులు, తాము చదివిన పాఠశాలకు అంబాసిడర్లుగా నియమించనున్నారు. తొలివిడతగా సెంటినరీ పాఠశాలలు సహా 8,209 పాఠశాలకు అంబాసిడర్ల నియామకం గత నెల 30వ తేదిలోగా చేపట్టాలని సూచించామన్నారు. ఆ ప్రకారం, జిల్లా అధికారులు, ప్రధానోపాధ్యాయుల కృషితో గత నెల 31వ తేది వరకు 3,999 పాఠశాలలకు 9,664 మంది దరఖాస్తు చేసుకున్నారని తెలిపింది. మిగిలిన పాఠశాలలకు గడువు ఈ నెల 23వ తేది వరకు పొడిగించామన్నారు. ఆ ప్రకారం, అంబాసిడర్‌గా నియమితులయ్యే పూర్వ విద్యార్థులు, ఆయా పాఠశాలల నిర్వహణ, అవసరాలు, అభిప్రాయాలు స్వీకరించే ముఖ్య ప్రతినిధిగా వ్యవహరిస్తారని పాఠశాల విద్య డైరెక్టరేట్ తెలిపింది.

విద్యార్థినిపై లైంగిక వేధింపులు

● యువకుడి అరెస్ట్

తిరుత్తణి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినిపై లైంగిక వేధింపులకు పాల్పడిన ఓ యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. వివరాల్లోకి వెళితే తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు సమీపంలోని ఓ కళాశాల విద్యార్థినిని ఆర్కేపేట ప్రాంతానికి చెందిన హేమంత్ (27) ప్రేమించమంటూ వేధించేవాడు. ఈ నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం కళాశాల నుంచి ఇంటికి వెళుతున్న విద్యార్థినిపై హేమంత్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాధితురాలు విషయాన్ని తన తల్లిదండ్రులకు తెలుపగా వారు పళ్లిపట్టు మహిళా పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. పోలీసులు యువకుడిని అరెస్టు చేశారు. కాగా నిందితుడు ఆ ప్రాంత బీజేపీ యువజన విభాగ నాయకుడిగా పోలీసులు గుర్తించారు. అతడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

అద్దె బకాయిలు చెల్లించడం లేదు

● పోలీసులకు గాయకుడు చరణ్ ఫిర్యాదు

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని సత్యా గార్డన్‌లోని తన ఇంట్లో అద్దెకు ఉంటున్న తిరుజ్ఞానంపై నేపథ్యగాయకుడు ఎస్పీ చరణ్ కేకే నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సినిమాల్లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న తిరుజ్ఞానం, 23 నెలలుగా అద్దె చెల్లించడం లేదని, అడిగితే అసభ్య పదాలతో దూషిస్తూ, బెదిరింపులకు పాల్పడుతున్నారని ఎస్పీ చరణ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పోలీసులు విచారణ చేపట్టారు.

తంజావూరులో ప్రమాదాల నిరోధానికి చర్యలు

● ప్రధాన రహదారులపై 'త్రీడి' చిత్రాలు



తంజావూరులో జీబ్రా క్రాసింగ్‌పై 'త్రీడీ' చిత్రాలు

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం తంజావూరులో రాష్ట్ర హైవేస్‌కు చెందిన రహదారుల్లో రోడ్డు ప్రమాదాలు జరుగకుండా అధికారులు రోడ్లపై 'త్రీడి' చిత్రాలు వేయించారు. జిల్లా కలెక్టర్ ప్రియంకా పంకజం ఉత్తర్వుల మేరకు రహదారుల శాఖ అధికారులు ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో కళాకారులతో రోడ్లపై మనిషి పుర్రె చిత్రాలు, పాదచారులు రోడ్లపై దాటే జీబ్రాక్రాసింగ్‌ల వద్ద కొయ్య దుంగల చిత్రాలను 'త్రీడి' పద్ధతిలో వేయించారు. వాహన చోదకులు ఈ చిత్రాలను చూసి వాహనాలను నెమ్మదిగా నడుపుతారని, ఫలితంగా ప్రమాదాల సంఖ్య తగ్గుతుందని అధికారులు చెబుతున్నారు. ఈ త్రీడీ చిత్రాలు సత్ఫలితాలను ఇస్తే మరిన్ని ప్రాంతాల్లో హెచ్చరిక బొమ్మలు గీయిస్తామన్నారు.

చైన్ స్నాచింగ్ కేసులో పంచాయతీ అధ్యక్షురాలి అరెస్ట్



భారతి

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బంగారు నగలు చోరీచేసిన డీఎం కేకు చెందిన పంచాయతి అధ్యక్షురాలు కటకటపాలయ్యారు. జూలై 14వ తేది నెర్‌కుంద్రంకు చెందిన వరలక్ష్మి బస్సులో వెళ్తున్న సమయంలో ఆమె ధరించిన నాలుగు సవర్ల నగలు చోరీకి గురయ్యాయి. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ ఫుటేజీ ఆధారంగా తిరుపత్తూర్ జిల్లా నరియంబేడు పంచాయతి అధ్యక్షురాలు భారతి చోరీకి పాల్పడిందని తెలుసుకుని ఆమెను అరెస్ట్ చేశారు. కాగా, భారతిపై ఇప్పటికే 10 చోరీ కేసులు విచారణలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో బాలిక మృతి

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్కూటీని ఇసుక లారీ ఢీకొన్న ఘటనలో పదేళ్ల బాలిక మృతిచెందిన ఘటన స్థానిక పోరూర్‌లో చోటుచేసుకుంది. పోరూర్‌కు చెందిన గణేష్ కుమార్తె యోగశ్రీ (10) అదే ప్రాంతంలోని పాఠశాలలో చదువుకుంటోంది. శనివారం ఉదయం యోగశ్రీ బంధువు శారద, యోగశ్రీ, ఆమె స్నేహితురాలు అప్లియా (10)లను అయ్యప్పన్‌తాంగళల్‌లోని ఫుట్ బాల్ శిక్షణా కేంద్రానికి మోపెడ్‌లో తీసుకెళ్లింది. పోరూర్ సమీపంలో వెనుకగా వచ్చిన ఇసుక లారీ మోపెడ్‌ను ఢీకొనడంతో ముగ్గురు కిందపడ్డారు. కిందపడిన యోగశ్రీపై లారీ చక్రం ఎక్కడంతో ఘటనా స్థలంలోనే మృతిచెందింది. సమాచారం అందుకున్న పోరూర్ పోలీసులు అక్కడికి చేరుకుని గాయపడిన అప్లియా, శారదలను ఆసుపత్రికి తరలించి, కేసు నమోదుచేసి పరారైన లారీ డ్రైవర్ కోసం గాలిస్తున్నారు.

రూ.7.50 కోట్ల తిమింగళం లాలాజలం స్వాధీనం

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చిదంబరంలో రూ.7.50 కోట్ల విలువైన అంబర్‌గ్రీస్ అనే తిమింగళం లాలాజలాన్ని స్వాధీనం చేసుకున్నారు. తిమింగళం లాలాజలం సుగంధ ద్రవ్యాలు, మందుల తయారీలో వినియోగిస్తుంటారు. అంబర్‌గ్రీస్ విలువ కోట్లలో ఉంటుంది. దీనిని తరలించే వారు ఎక్కువవడంతో తిమింగళాల రక్షణార్థం అంబర్‌గ్రీస్ తరలింపుపై నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో, చిదంబరం ప్రాంతంలో అంబర్‌గ్రీస్ తరలిస్తున్నారనే సమాచారంతో, పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఆ సమయంలో అటుగా వచ్చిన కారు ఆపి తనిఖీ చేసిన పోలీసులు, తెల్ల కవరులో ఉంచిన రూ.7.కోట్ల విలువైన అంబర్‌గ్రీస్ స్వాధీనం చేసుకుని, కారులో ప్రయాణిస్తున్న మైలాడుదురైకి చెందిన రాజశేఖర్‌ను అరెస్ట్ చేసి విచారిస్తున్నారు.

అంబేడ్కర్ పురస్కారానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి) అంబేడ్కర్ పురస్కారానికి అర్హులైన వారు అక్టోబరు 15వ తేదిలోగా దరఖాస్తు సమర్పించాలని చెన్నై జిల్లా కలెక్టర్ రష్మి సిద్దార్థ్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ విడుదల చేసిన ప్రకటనలో... రాష్ట్రంలో ఆదిద్రావిడుల అభ్యున్నతి, పురోగతికి పలువురు తమ వంతు సాయం చేస్తున్నారు. అలాంటి వారికి పోత్సహించేలా, రాష్ట్రానికి చెందిన ఒకరికి ప్రతి ఏడాది అంబేడ్కర్ పురస్కారంతో సత్కరిస్తుంటారు. ఆ ప్రకారం, 2026 ఏడాది తిరువళ్లువర్ దినోత్సవం రోజున ఈ పురస్కారం అందజేయనున్నారు. ఆసక్తి కలిగిన వారు కలెక్టరేట్‌లోని ఆదిద్రావిడ, గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తులు పొంది, తమ స్వీయ వివరాలు, చేసిన సేవా కార్యక్రమాలతో దరఖాస్తులను అక్టోబరు 15వ తేదిలోగా సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

చెరకు లారీని అడ్డుకున్న ఏనుగు



లారీపై కప్పిన టార్పాలిన్ తొలగిస్తున్న ఏనుగు

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం సమీపంలో తాళవాడి రహదారిలో వెళుతున్న ఓ చెరకు లారీని అడవి ఏనుగు అడ్డుకుంది. గురువారం సాయంత్రం లారీకి అడ్డంగా ఆ ఏనుగు నిలిచి ఆపింది. ఆ లారీ వెనుక టార్పలిన్ తొలగించి చెరకు గడలను ఆరగించింది. సుమారు అరగంట సేపు ఆ లారీ కేబిన్‌లో ఉన్న డ్రైవర్ ఊపిరి బిగపట్టి కదలకుండా ఉన్నాడు. ఈ లారీ రహదారిలో నిలిచిపోవటంతో దాని వెనుకే వచ్చిన వాహనాలు కూడా ఆగిపోయాయి. దీంతో అరగంటకు పైగా ఆ మార్గంలో వాహనాల రాకపోకలు ఆగిపోయాయి. చెరకు గడలను ఆరగించిన ఏనుగు నెమ్మదిగా నడచుకుంటూ అడవిలోకి వెళ్ళిపోయింది. ఈ సంఘటనపై లారీ డ్రైవర్ అటవీ శాఖ అధికారులకు ఫిర్యాదు చేశారు.

నేడు 'మండలి కృష్ణారావు శతజయంతి సభ'

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక మైలాపూర్ లజ్‌లో వున్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారకమండపంలో ఆదివారం 'మండలి వెంకట కృష్ణారావు శత జయంతి సభ' జరుగనుంది. అమరజీవి పొట్టి శ్రీరాములు స్మారక భవన నిర్వాహక కమిటీ ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు జరుగనున్న ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఒంగోలు పార్లమెంటు సభ్యులు మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ప్రత్యేక అతిథులుగా మండలి బుద్ధ ప్రసాద్, ఆచార్య సీఎంకే రెడ్డి, ఆత్మీయ అతిథిగా భువన చంద్ర హాజరు కానున్నారు. కమిటీ ప్రధాన కార్యదర్శి వి.కృష్ణారావు స్వాగతం పలుకనున్న ఈ కార్యక్రమానికి కమిటీ అధ్యక్షులు కాకుటూరు అనిల్‌కుమార్‌రెడ్డి అధ్యక్షత వహించనున్నారు. కార్యక్రమంలో భాగంగా స్మారకమండపంలో ఆధునీకీకరించిన గ్రంథాలయాన్ని ఆవిష్కరించనున్నారు. కార్యక్రమాన్ని గుడిమెట్ల చెన్నయ్య నిర్వహించనుండగా, ఆచార్య విస్తాలి శంకరరావు వందన సమర్పణ చేయనున్నారు. ఈ కార్యక్రమానికి అందరూ ఆహ్వానితులేనని కమిటీ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.,

సోషల్ మీడియా బెదిరింపు పోస్టుల నుంచి రక్షణ కల్పించలేము: హైకోర్టు

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో బెదిరింపు పోస్టులకు రక్షణ కల్పించలేమని హైకోర్టు పేర్కొంది. బీజేపీ రాష్ట్ర ఓబీసీ విభాగం ఉపాధ్యక్షుడు దురై షణ్ముగ మణికంఠన్ హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్‌లో... రూ.25 లక్షలు ఇవ్వాలని సోషల్ మీడియాలో కొందరు పోస్ట్ చేస్తున్నారని, అందువల్ల తనకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ పిటిషన్ విచారించిన న్యాయస్థానం... సోషల్ మీడియాలో వచ్చే బెదిరింపు పోస్టులకు రక్షణ కల్పించలేమని, కేసు తోసిపుచ్చుతూ ఉత్తర్వులు జారీచేసింది.

రూ.2వేల కోట్లతో 28 మెట్రో రైళ్లు కొనుగోలు

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆరు బోగీలతో కూడిన 28 మెట్రో రైళ్ల కొనుగోలుకు టెండర్లు ఆహ్వానించినట్లు చెన్నై మెట్రోరైల్ లిమిటెడ్ (సీఎంఆర్ఎల్) అధికారులు తెలిపారు. నగరంలో నడుపుతున్న మెట్రోరైళ్లలో ప్రతిరోజు సుమారు 4 లక్షల మంది ప్రయాణిస్తుండగా, పీక్ అవర్స్‌లో రద్దీ అధికంగా ఉండడంతో, అదనపు బోగీలు జతచేయాలని ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు, కార్యాలయాల సమయాల్లో ఆరు బోగీలు జతచేసి నడిపడంపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. ఈ విషయమై సీఎంఆర్ఎల్ అధికారులు మాట్లాడుతూ... తొలివిడత మెట్రోరైలు ప్రాజెక్ట్‌లో రెండున్నర నిమిషాలకు ఒక రైలు నడిపే స్థాయికి సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉందన్నారు. ప్రయాణికుల రద్దీ పరిగణలోకి తీసుకుని 6 బోగీలతో రైళ్లు నడపాలని నిర్ణయించామని, తొలివిడతగా 28 కొత్త మెట్రో రైళ్ల కొనుగోలుకు రూ.2వేల కోట్లతో టెండర్లు ఆహ్వానించినట్లు, అనంతరం కొత్త మెట్రో రైళ్లు విడతల వారీగా అందుబాటులోకి వస్తాయని అధికారులు తెలిపారు.

నారాయణ గుప్తాకు సతీవియోగం



మేడా జ్యోతి (ఫైల్‌ఫొటో)

ప్యారీస్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ వైస్ ప్రెసిడెంట్, విద్యాసంకల్ప డా.ఎంవీ నారాయణగుప్తా సతీమణి మేడా జ్యోతి (73) వృద్ధాప్యం, అనారోగ్యం కారణంగా గురువారం రాత్రి మరణించారు. జేఎస్ చిట్‌ఫండ్స్ డైరెక్టర్‌గా, సంఘ సేవకురాలిగా వ్యవహరించిన జ్యోతి గత కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఈ నెల 4వ తేదీ రాత్రి 8 గంటలకు మృతి చెందారు. ఆమె భౌతికకాయాన్ని కోడంబాక్కం రంగరాజపురంలో ఉన్న అశోక అవెన్యూలో సందర్శనార్థం ఉంచగా, వాసవీ క్లబ్‌ల ప్రతినిధులు, వైశ్య సంఘాల ప్రతినిధులు, ఏఐటీఎఫ్ నిర్వాహకులు, జేఎస్ చిట్‌ఫండ్స్ ఉద్యోగులు వెళ్లి అంజలి ఘటించారు. జ్యోతి అంత్యక్రియలు శుక్రవారం జరిగినట్లు నారాయణగుప్తా తెలిపారు.


10లోగా విద్యార్థినుల వివరాలు పంపించండి

పెరంబూర్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ఎంబీసీ విద్యార్థినుల ఆధార్, ఇతర వివరాలు ఈ నెల 10వ తేదిలోగా నమోదుచేయాలని ప్రాథమిక విద్యాశాఖ ఉత్తర్వులు జారీచేసింది. ఈ మేరకు ప్రాథమిక విద్య డైరెక్టరేట్ నుంచి విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో... గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో 3 నుంచి 6వ తరగతి వరకు చదువుతున్న అత్యంత వెనుకబడిన, వెనుకబడిన విద్యార్థులు చదువు మధ్యలో మానేయకుండా ప్రోత్సాహక భత్యం అందించాలని నిర్ణయించి, 'ఎమిస్' వెబ్‌సైట్‌లో విద్యార్థినుల వివరాలు పంపించాలని గతంలో సూచించామన్నారు. అందులో 13,304 విద్యార్థినుల ఆధార్ వివరాలు, 60,349 మంది బ్యాంక్ ఖాతా నెంబరు, 45,498 మంది విద్యార్థుల వార్షికాదాయం వివరాలు లేవని, ఈ నెల 10వ తేదిలోగా వివరాలు పూర్తిగా పంపించాలని ప్రాథమిక విద్యాశాఖ తెలిపింది.

తప్పుదోవ పట్టించిన గూగుల్

● గోతిలో బోల్తాపడ్డ లారీ

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): కొడైకెనాల్‌లో గూగుల్ మ్యాప్ సహాయంతో బయలుదేరిన ఓ లారీ అదుపుతప్పి రోడ్డుపక్కనే ఉన్న గోతిలో పడి వేలాడసాగింది. కర్ణాటక రిజిస్ట్రేషన్ కలిగిన లారీని తిరునల్వేలికి చెందిన డ్రైవర్ ఫర్నిచర్ లోడుతో కొడైకెనాల్ సమీపంలోని చిన్నపళ్లం బయలుదేరాడు. చిన్నపళ్లం ప్రాంతం తెలియకపోవడంతో గూగుల్ మ్యాప్ సాయం తీసుకుంటూ లారీని నడిపాడు. చివరకు ఆ లారీ ఇరుకు వీధిలో వెళ్ళి అదుపుతప్పి రోడ్డు పక్కనున్న గోతిలో పడి వేలాడుతూ ఆగింది.. అదృష్టవశాత్తూ డ్రైవర్ స్వల్పగాయాలతో బయటపడ్డాడు. చిన్నపళ్లం ప్రాంతానికి వెళ్లేందుకు విశాలమైన రోడ్డు ఉన్నప్పటికీ గూగుల్ మ్యాప్ ఇరుకైన వీధి చూపటం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ వాపోయాడు. పోలీసులు కేసు నమోదుచేసుకుని గోతిలో ఉన్న లారీని వెలికి తీసే పనులు చేపట్టారు.



'బాంబ్'లో ఓ దృశ్యం

12న విడుదలకు సిద్ధమైన 8 చిత్రాలు


ఈ నెల రెండో శుక్రవారం 12వ తేదీ ఏకంగా ఎనిమిది చిత్రాలు విడుదలకానున్నాయి. అయితే, చివరి నిమిషంలో ఎన్ని చిత్రాలు ఆగిపోతాయో వేచి చూడాల్సిందే. ఈ యేడాది ప్రతి వారం కనీసం నాలుగు లేదా ఐదు చిత్రాలు విడుదలయ్యాయి. ఆ లెక్కన ఈ యేడాది ఇప్పటివరకు 180 సినిమాలు విడుదలయ్యాయని చెప్పుకోవచ్చు. ఈ క్రమంలో ఈ నెల 12వ తేదీన 'అంద 7 నాడ్గల్', 'బ్లాక్‌మెయిల్', 'బాంబ్', 'దావూద్', 'కుమారసంభవం', 'తణల్', 'ఉరుట్టు ఉరుట్టు', 'యోలో' వంటి చిత్రాలు విడుదలకు సిద్ధంగా ఉన్నాయి. అయితే, ఈ చిత్రాలన్నీ ముందుగా ప్రకటించినట్టుగా విడుదలవుతాయా? లేదా? అన్నది వేచి చూడాల్సివుంది. వచ్చే నెల 1వ తేదీ ధనుష్ నటించిన 'ఇడ్లీ కడై', ఆ తర్వాత దీపావళికి మరికొన్ని పెద్ద చిత్రాలు విడుదలకు కానున్నాయి. దీంతో అనేక మంచి చిన్న నిర్మాతలు తమ చిత్రాలను ముందుగానే విడుదల చేసేలా ప్లాన్ చేసుకుంటున్నారు.

ప్రముఖ గేయరచయిత 'పూవై' కన్నుమూత



పూవై చెంగుట్టువన్ (ఫైల్‌ఫొటో)

తమిళ చిత్రపరిశ్రమలో విషాదం నెలకొంది. ప్రముఖ సినీ గేయ రచయిత పూవై చెంగుట్టువన్ (90) కన్నుమూశారు. పెరంబూరులో నివశిస్తున్న ఆయన గత కొంతకాలంగా వృద్ధాప్యంతో బాధపడుతూ శుక్రవారం నివాసంలోనే తుదిశ్వాస విడిచారు. ఆయనకు పూవై దయానిధి, రవిచంద్రన్ అనే ఇద్దరు కుమారులు, కలై సెల్వి, విజయలక్ష్మి అనే కుమార్తెలు న్నారు. శివగంగై జిల్లా కీళపూంగుడి గ్రామానికి చెందిన ఆయన అసలు పేరు మురుగవేల్ గాంధీ. 'చేరన్ చెంగుట్టువన్' అనే నాటకం చూసిన తర్వాత తన పేరును చెంగుట్టువన్‌గా మార్చుకున్నారు. అలాగే, తన పూరి పేరును తన పేరు ముందు చేర్చి పూవై చెంగుట్టువన్‌గా స్థిరపడిపోయారు. కాగా 1967 నుంచి గేయరచయితగా కొనసాగుతున్న ఆయన... ఎక్కువగా భక్తి పాటలు రాశారు. వెయ్యికి పైగా సినిమా పాటలు, 4000కు పైగా ఆల్బమ్ సాంగ్స్ రాయడమే కాకుండా, రెండు చిత్రాలకు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు సమకూర్చారు. ఎంజీఆర్ నటించిన 'పుదియ భూమి' అనే చిత్రంలో 'నాన్ ఉంగ వీట్టు పిళ్లై', 'అగస్త్యర్' మూవీలో 'తాయి సిరంద కోయిల్ ఇల్లై', 'రాజరాజ చోళన్', 'గౌరీ కళ్యాణం' వంటి అనేక చిత్రాల్లో ఆయన రాసిన పాటలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. 'కందన్‌కరుణై' సినిమాలో ఆయన రాసిన 'తిరుప్పరంకుండ్రత్తిల్ నీ సిరిత్తాల్ మురుగా... తిరుత్తణి మలైమీదు ఎదురొలిక్కుమ్' పాట మురుగప్పెరుమాన్ భక్తుల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుంది. సినీ పాటలతో పాటు నాటకాలు, టెలివిజన్ ధారావాహికలను కూడా ఆయన సహకారం అందించారు. మాజీ ముఖ్యమంత్రులైన దివంగత అన్నాదురై, కరుణానిధి, ఎంజీఆర్, జయలలిత, ప్రస్తుతం సీఎం ఎంకే స్టాలిన్‌కు పాటలు రాసిన అరుదైన ఘనత ఆయనకే దక్కింది. అన్నాదురై ప్రభుత్వం ఏర్పాటు కాగానే 'అరింజ్ఞర్ అన్నా ఆట్చిదానిదు' అనే ప్రైవేటు ఆల్బమ్, కరుణానిధి కోసం 'కరుణను, నిధిని ఒకటిగా చేరిస్తే కరుణానిధి అవుతుంది' అనే పాట రాశారు. తమిళ చిత్రపరిశ్రమలో బహుముఖ ప్రజ్ఞాశాలిగా గుర్తింపు పొందిన పూవై చెంగుట్టువన్ మృతి పట్ల పలువురు ప్రముఖులు తమ ప్రగాఢ సంతాపాన్ని, సానుభూతిని వ్యక్తం చేశారు.



శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో 'ది గేమ్'

చిత్రజ్యోతి

శ్రద్ధా శ్రీనాథ్ ప్రధాన పాత్రలో నటించిన తాజా వెబ్ సిరీస్ 'ది గేమ్: యు నెవర్ ప్లే అలోన్'. నెట్‌ఫ్లిక్స్, అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్ సంస్థలు సంయుక్తంగా నిర్మించాయి. వచ్చే నెల రెండో తేదీ నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కానుంది. 2025లో తమిళ చిత్రపరిశ్రమలో హైపర్ కనెక్ట్ థ్రిల్లర్ సిరీస్‌గా, రాజేష్ ఎం.సెల్వా దర్శకత్వంలో తెరకెక్కించారు. ఇతర పాత్రల్లో సంతోష్ ప్రతాప్, చాందిని, శ్యామా హరిణి, బాలాహాసన్, సుభాష్ సెల్వం, వివియా సంత్, ధీరజ్, హేమ తదితరులు నటించారు. ఈ తమిళ సిరీస్ వివరాలను నెట్‌ఫ్లిక్స్ వైస్‌ప్రెసిడెంట్ మోనికా షెర్గిల్ వెల్లడిస్తూ, 'ది గేమ్' ఈ యేడాది తొలి తమిళ థ్రిల్లింగ్ సిరీస్. ఇది గ్రిప్పింగ్ మిస్టరీ థ్రిల్లర్. ఓ మహిళా గేమ్ డెవలపర్ తనపై జరిగిన సైబర్ దాడికి కారణమైన వారిని గుర్తించే అవిశ్రాంత మిషన్. అప్లాజ్ ఎంటర్‌టైన్మెంట్‌తో కలిసి గతంలో 'బ్లాక్ వారెంట్' వంటి అద్భుతమైన సిరీస్ రూపొందించాం. ఇపుడు రెండో సిరీస్‌గా 'ది గేమ్' నిర్మించాం' అని తెలిపారు. దర్శకుడు రాజేష్ ఎం.సెల్వ మాట్లాడుతూ, 'ది ఒక థ్రిల్లర్ కంటే ఎక్కువ. ప్రతి ఒక్కరినీ ఎంజాయ్ చేసేలా ఉంటుంది' అని పేర్కొన్నారు.



వెట్రిమారన్

వెట్రిమారన్ దర్శకత్వంలో శింబు?

జాతీయ అవార్డు గ్రహీత, దర్శక నిర్మాత వెట్రిమారన్ దర్శకత్వంలో హీరో శింబు ఓ చిత్రంలో నటించనున్నారు. ఈ మేరకు దర్శకుడు తన పుట్టిన రోజు (సెప్టెంబరు 4)న అధికారికంగా వెల్లడించారు. 'వి' క్రియేషన్స్ పతాకంపై ప్రముఖ నిర్మాత కలైపులి ఎస్.థాను ఈ సినిమా భారీ బడ్జెట్‌తో తెరకెక్కించనున్నారు. దీనిపై అధికారికంగా త్వరలో ప్రకటన రానుంది. శింబు నటించే కొత్త చిత్రానికి సంబంధించి ప్రోమోను దర్శకుడు ఇప్పటికే సిద్ధం చేశారు. అయితే, దాన్ని పూర్తిగా రిలీజ్ చేయకుండా, చిన్న గ్లింప్స్‌ను విడుదల చేసి ప్రేక్షకులను, హీరో అభిమానులను ఉత్కంఠకు గురి చేశారు. కాగా ఈ చిత్రంలో 'వడచెన్నై'లో నటించిన హీరో ధనుష్ కాకుండా, మిగిలిన నటీనటులంతా నటించనున్నట్టు సమాచారం.



శింబు

SUNDAY SPECIAL

మేమూ మనుషులమే..!

ప్లాట్‌ఫామ్ బతుకులు బొమ్మరిల్లు జీవితాలు

● గానా పాటల రచయిత మద్రాస్ మిరన్ బతుకు చిత్రం

టి.నగర్, ఆంధ్రజ్యోతి

మనిషికి కనీస అవసరాలు 'తినటానికి తిండి, కట్టుకునేందుకు బట్ట, ఉండటానికి ఇల్లు ఉంటే చాలు'. అయితే రాజధాని నగరం చెన్నైలో ఎన్నో తరాలుగా కనీస సదుపాయాల్లేని లక్షలాది మంది ప్లాట్‌ఫామ్‌పైనే బతుకు బండి లాగిస్తున్నారు. 'సార్పట్టా పరంబరై', 'ప్యారీస్ జయరాజ్' వంటి సినిమాలకు గానా పాటలు రాసిన మద్రాస్ మిరన్ కూడా ఆ కోవకు చెందినవాడేనని, ప్లాట్‌ఫామ్‌పైనే జీవిస్తున్నాడని తెలిస్తే అందరికీ ఆశ్చర్యమేస్తుంది. బ్రాడ్వేలోని ప్లాట్‌ఫామ్‌పై కుటుంబంతో గానా పాటల రచయిత నివసిస్తున్నాడు.



రేకుల పైకప్పు కింద మద్రాస్ మిరన్, భార్యాపిల్లలు



మద్రాస్ మిరన్ పక్కింటివారు

'మా తాతముత్తాలకు ముందు నుంచి మేమంతా ఇక్కడే నివశిస్తున్నాం. బొమ్మరిల్లు లాంటి జీవితాలు మావి! నాకు పెళ్ళయ్యింది. ముగ్గురు పిల్లలు. కష్టపడి చదివిస్తున్నాను. మాబోటివాళ్లకు చదువుంటేనే కదా సార్ గౌరవం!' అంటూ మిరన్ నవ్వాడు. మద్రాస్ మిరన్ నివాసముంటున్న స్థలం పది అడుగుల పొడవు, పది అడుగుల వెడల్పు ఉంది. కాస్త ఎత్తుగా ఉన్న వ్యక్తి అక్కడ అడుగుపెడితే ఫ్యాన్ తలకు తగులుతుంది. ఓ మంచం, రెండు మూడు దుస్తుల మూటలు, ముఖం చూసుకోవడానికి ఓ అద్దం. పక్కనే పెంచుకుంటున్న నాలుగు పిచ్చుకలు... ఇవే అతడి ఆస్తిపాస్తులు. మద్రాస్ మిరన్ ఆ ప్లాట్‌ఫామ్‌పై తాముంటున్న స్థలాన్ని విలాసవంతమైన బంగళాగానే భావించి, సంతోషంగా గడుపుతున్నాడు. అతడిప్పుడు లా కోర్సు కూడా చేస్తున్నాడు. అతడి భార్య చిత్రా పండ్ల దుకాణంలో పనిచేస్తోంది.

మా శ్రమని గుర్తించని సమాజం...!

'వంటచేసుకోడానికి, చదువుకోడానికి, నిద్రపోడానికి, మా సామగ్రి ఉంచుకోడానికి, స్నానం చేయడానికి ఈ పదడుగుల స్థలమే. ఇక్కడ పేరుకుపోయే చెత్తాచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించి శుభ్రంగా ఉంచుకుంటున్నాం. చేపలబండి నడపటం, శవాల ఊరేగింపులో నృత్యం చేయడం, చెప్పులు కుట్టడం, మూటలు మోయడం ఇలా ఇంకా ఎన్నో పనులు చేస్తుంటాము. ఇవన్నీ మా కాయకష్టంతో చేస్తున్న పనులే. అయితే సమాజం ఈ పనులను మా శ్రమగా గుర్తించకుండా, ప్లాట్‌ఫామ్‌పై బ్రతుకుతున్నవారే ఇవన్నీ చేయడానికి పుట్టినవారిగా భావించడం చాలా బాధపడుతున్నాం సార్!' అంటూ మద్రాస్ మిరన్ చెబుతున్నప్పుడు అతడి మాటల్లో దాగిన బాధ వ్యక్తమైంది. 'చదువు, ఉద్యోగం, నిద్రపోడానికి ఓ చోటు, స్నానం చేయడానికి ఓ మరుగుదొడ్డి, వంటికి జబ్బులొస్తే వైద్యం - ఈ వసతులు వుండి, ఇతరుల్లాగే మేము కూడా బ్రతకాలని ఆశపడుతున్నాం. ఇంతకు మించిన గొంతెమ్మ కోరికలేవీ మా వద్ద లేవుసార్' అని మద్రాస్ మిరన్ చెబుతుంటే చుట్టూచేరిన ప్లాట్‌ఫామ్ వాసుల కళ్ళల్లో తడి కనిపించింది.

శరణార్థులం కాదు...

"మాకూ ఓటు హక్కు ఉంది. మేమంతా పొరుగు దేశాల నుండి బ్రతుకుతెరువు కోసం వచ్చిన శరణార్థులం కాము. మేము కూడా మీలాంటి మనుషులమే. మమ్మల్ని ఎందుకు హేళనగా చూస్తున్నారు? రోడ్డే మా ఇల్లు. మా ఇంటిలో నుంచి రోజూ ఎన్ని వందల మంది నడిచివెళుతుంటారో తెలుసా? మా లాగా, మీ ఇంటిలో తెలియని వ్యక్తులను అడుగుపెట్టేందుకు అంగీకరిస్తారా? అప్పుడెప్పుడో మా పూర్వీకులు బతుకుతెరువు కోసం ఇక్కడికి వచ్చారు. ఇప్పుడు మేమంతా అనాథల్లా మిగిలిపోయాం. ఎండ, వాన, గాలి ఏవొచ్చినా మాకు ఈ చెట్టే పైకప్పు. చేతి బిడ్డలను పెట్టుకుని చెట్టుకింద జీవించడం ఎంత కష్టమో మీకెవ్వరికీ తెలియవు. ఆడపిల్లలకు మరుగుదొడ్లు లేకపోతే ఎంత కష్టపడతారో ఆ బాధను మాటల్లో వివరించలేం. మా పిల్లలంతా ఎప్పుడూ బీడీలు, మందు (మద్యం), గంజాయి తాగుతూ మత్తులోనే జోగాడుతుంటారని అపోహపడుతుంటారు. అలా అందరినీ ఒకే గాటన కట్టడం తప్పు. నిజం చెప్పాలంటే ప్లాట్‌ఫామ్‌పై బ్రతుకుతున్న మమ్మల్ని హేళనగా చూస్తున్నవారే అధికం. ఏ కొద్దిమందో చేసిన తప్పులకు అందరూ అలాంటి వారేనని భావించడం న్యాయమా సార్? అందరివద్దా మేం కోరుకుంటున్నది ఒక్కటే..! మేమూ మీలాంటి మనుషులమే! మమ్మల్ని, మా పిల్లలను గౌరవంగా బ్రతికేందుకు అనుమతించండి.. మా పట్ల మర్యాద చూపకపోయినా ఫరవాలేదు! తప్పుడు మనుషులమని భావించకుండా ఉంటే అదే చాలు..!" అంటూ మద్రాసు మిరన్ ముక్తాయింపుగా పలికిన మాటలు ఈ సమాజంలో తప్పకుండా కొత్త మార్పు తీసుకు వస్తుందని ఆశిద్దాం...!



ప్లాట్‌ఫామ్‌పై పాదచారులు

ఘనంగా శివకుమార్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్

46వ వార్షికోత్సవం

● విద్యార్థులకు నగదు పురస్కారం



విద్యార్థులతో శివకుమార్, సూర్య, కార్తి తదితరులు

అడయార్, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ సీనియర్ సినీ నటుడు శివకుమార్‌కు చెందిన 'శివకుమార్ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్' 46వ వార్షికోత్సవ వేడుకలు ఇటీవల నగరంలో జరిగాయి. ఈ ఫౌండేషన్ తరపున ప్లస్‌టూ పరీక్షల్లో ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను ఎంపిక చేసి బహుమతులను ప్రదానం చేశారు. విద్యార్థులను ప్రోత్సహించేలా తన వందో చిత్రం సందర్భంగా ఈ ఫౌండేషన్‌ను నటుడు శివకుమార్ ప్రారంభించారు. ఈ ఫౌండేషన్ 46వ వార్షికోత్సవంలో 25 మంది విద్యార్థులకు రూ.10 వేలు చొప్పున ఆయన అందజేశారు. అలాగే, దిండివనం ఎడ్యుకేషన్ డెవలప్‌మెంట్‌కు రూ.లక్ష ఆర్థిక సాయం చేశారు. థాయ్ తమిళ పాఠశాల పథకం కింద కృష్ణగిరిజిల్లాలో 'వాళై'సంస్థ నిర్వహిస్తున్న పాఠశాలకు రూ.1.50 లక్షలు అందజేశారు. తిరువణ్ణామలై జిల్లాలోని గిరిజన ప్రాథమిక పాఠశాల అభివృద్ధి పనులకు రూ.40 వేల ఆర్థిక సాయాన్ని శివకుమార్ చేశారు.ఈ సందర్భంగా ఆయన విద్యార్థులకు కలిసి తన చిన్ననాటి అనుభూతులను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న హీరో సూర్య మాట్లాడుతూ, 'శివకుమార్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్' అవార్డు ప్రదానోత్సవం తొలుత మా ఇంటి నుంచే మొదలై, ఇపుడు రాష్ట్ర వ్యాప్తంగా విస్తరించినట్టు తెలిపారు. సమాజంలోని మంచిని మాత్రమే స్వీకరించి ముందుకు సాగితే మనంకటూ ఒక మార్గం, స్థానం ఉంటుందని విద్యార్థులకు హీరో సూర్య సూచించారు. ఈ వేడుకలో హీరో కార్తీ, దర్శకుడు టీజే జ్ఞానవేల్ తదితరులు పాల్గొన్నారు.



తిరువళ్లూరు జిల్లా మధురవాయిల్ సమీపం నోలంబూరు యూనియన్ రోడ్డు - పూందమల్లి రహదారి మధ్య కూవం మురుగు కాల్వపై రూ.31.65 కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్‌ను శనివారం ఉదయం పరిశీలిస్తున్న మేయర్ ఆర్. ప్రియ తదితరులు

ఘనంగా ఇస్లామియా కళాశాల స్నాతకోత్సవం



విద్యార్థినికి పట్టా అందజేస్తున్న వీఐటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంధ్య

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేలూరు సమీపం వాణియంబాడిలోని ఇస్లామియా మహిళా కళాశాల 25వ స్నాతకోత్సవం శనివారం అత్యంత వైభవంగా జరిగింది. వీఐటీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డాక్టర్ సంధ్య ముఖ్యఅతిథిగా హాజరై గ్రాడ్యుయేట్లకు పట్టాలను ప్రదానం చేసి ప్రసంగించారు. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు వారి తల్లిదండ్రులు, గురువులు, కళాశాల అధ్యాపకులు, నిర్వాహకులను ఎన్నడూ మరచిపోకూడదని, ఉన్నతస్థితికి చేరుకున్న తర్వాత కళాశాల అభివృద్ధికి తమ వంతు సేవలను అందించాలని డాక్టర్ సంధ్య పిలుపునిచ్చారు. ఉద్యోగాలపైనే దృష్టిసారించకుండా సొంత వ్యాపారాలను ప్రారంభించి పదుగురి ఉపాధి కల్పించేలా పారిశ్రామికవేత్తలుగా మహిళలు ఎదగాలని సూచించారు. కళాశాల అధ్యక్షుడు అహమ్మద్ బాషా, ప్రధాన కార్యదర్శి అబ్దుల్లా బాషా, కార్యదర్శి సి కైజర్ అహమ్మద్, ప్రిన్సిపాల్ డాక్టర్ రేణు తదితరులు పాల్గొన్నారు.

చెన్నై మార్కెట్లోకి వోల్వో ఎక్స్‌30 ఎలక్ట్రిక్ కార్లు



నగరంలో వోల్వో 'ఎక్స్‌30' ఎలక్ట్రిక్ కారు పరిచయం చేస్తున్న సంస్థ నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వోల్వో కార్ ఇండియా సంస్థ 'ఎక్స్ 30' పేరుతో కొత్త ఎలక్ట్రిక్ కార్లను చెన్నై మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. నగరంలోని తేనాంపేట, అంబత్తూరు డీలర్‌షిప్‌ల్లో టెస్ట్ డ్రైవ్‌కు అందుబాటులో ఉంచినట్లు సంస్థ నిర్వాహకులు తెలిపారు. కస్టమర్లంతా ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఈ ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ ధర, ఇతర వివరాలు ఈ నెలాఖరులో అధికారికంగా ప్రకటిస్తామని, అక్టోబర్ నుండి డెలివరీ ప్రారంభమవుతుందని, ఈ ఎక్స్30 ఎలక్ట్రిక్ కార్లను కర్ణాటకలోని బెంగళూరు హోస్‌కోట ప్లాంట్‌లో అసెంబుల్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆకట్టుకున్న పాసింగ్ అవుట్ పరేడ్



శిక్షణ పూర్తిచేసుకున్న క్యాడెట్ల ఆనందం

చెన్నై, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీ (ఓటీఏ)లో శిక్షణ పూర్తిచేసుకున్న క్యాడెట్ల పాసింగ్ అవుట్ పరేడ్ శనివారం జరిగింది. షార్ట్ సర్వీస్ కమిషన్ (ఎస్ఎస్‌సీ)లో 120 మంది పురుషులు, 34 మంది మహిళలకు ఓటీఏలో ఏడాది శిక్షణ ఇచ్చారు. శిక్షణా కాలం పూర్తికావడంతో శనివారం అవుట్ పరేడ్ నిర్వహించారు. పరేడ్‌కు ముఖ్యఅతిథిగా ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్ హాజరై, క్యాడెట్ల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. శిక్షణలో ప్రతిభ చూపిన రాజ్ బిశ్వాస్‌కు 'స్వోర్డ్ ఆఫ్ హానర్', సిల్వర్ మెడల్, ఓటీఏ గోల్డ్ మెడల్ పారుల్ దద్వాల్‌కు, ప్రణజల్ దీక్షిత్‌కు బ్రౌంజ్ మెడల్ ప్రదానం చేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారు భారత సైనిక రంగంలో నియమించనున్నట్లు అధికారులు తెలిపారు. పెరేడ్ పూర్తిచేసుకున్న క్యాడెట్లు, తమ తల్లిదండ్రులు, బంధువులు, స్నేహితుల మధ్య ఆనందంగా గడిపారు.



గౌరవ వందనం స్వీకరిస్తున్న చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్ సింగ్


జస్టిస్ వైద్యనాథన్


జస్టిస్ మన్మథరావు


జస్టిస్ ఇందిరేష్


జస్టిస్ అనిరుధ పీ మాయి

తిరుమలలో పలువురు న్యాయమూర్తులు

తిరుమల శ్రీవారిని శనివారం వివిధ హైకోర్టుల న్యాయమూర్తులు దర్శించుకున్నారు. వీరిలో తెలంగాణ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్, కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ మన్మథరావు, జస్టిస్ ఈఎస్ ఇందిరేష్, గుజరాత్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనిరుధ పీ మాయి, మేఘాలయ హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ వైద్యనాథన్ ఉన్నారు. ఇంకా నటుడు దాసరి అరుణ్‌కుమార్ కూడా స్వామిని దర్శించుకున్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి


సర్వ దర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ బాటగంగమ్మ ఆలయ సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం : రూ.3.49 కోట్లు


శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు : 69,531

తలనీలాలు సమర్పించినవారు: 31,439



యోగా.. శరీరాన్నీ, మనసునూ నియంత్రించే గొప్ప ప్రక్రియ. మనదేశ సాంస్కృతిక సంపదలో భాగమైన ఈ ఆరోగ్య ప్రక్రియ ఇప్పుడు బాగా ప్రాచుర్యం పొందింది. అయితే 55ఏళ్ల క్రితమే దీని ప్రాధాన్యతను గుర్తించి అనుసరించారు గూడూరుకు చెందిన కట్టా మురళీకృష్ణ. ఆసనాలను అతి సులభంగా వేస్తూ ఆ రోజుల్లోనే అబ్బురపరిచేవారు. ఆయన వారసత్వాన్నే పుణికి పుచ్చుకున్న ఆయన మనవడు మరో అడుగు ముందుకేశాడు. యోగాలో కష్టతరమైన శలభాసనం వేసి గిన్నిస్ రికార్డు సాధించాడు. అందరి దృష్టినీ ఆకట్టుకుని ఔరా అనిపించుకుంటున్నాడు. యోగాసనాలు వేసేవారికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడీ పిన్న వయస్కుడు.

- గూడూరు, ఆంధ్రజ్యోతి




ఎమ్మెల్యే సునీల్‌కుమార్ చేతుల మీదుగా గిన్నిస్ రికార్డు అందుకుంటూ..

శలభాసనంలో శెభాష్.. ద్వారకేష్

● యోగాలో క్లిష్టమైన ప్రక్రియలో గిన్నిస్ రికార్డు

కట్టా వెంకట ద్వారకేష్.. గూడూరు సొసైటీ కాలనీకి చెందిన ఈ యువకుడు బెంగళూరులో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. యోగా రంగంలో అద్భుతాలు ఆవిష్కరిస్తున్నాడు. ఇతని తాత మురళీకృష్ణ 1970లో ఆధ్యాత్మిక యోగ వెల్ఫేర్ అసోసియేషన్‌ను స్థాపించారు. యోగా గురువుగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఈయన కుమారుడు రాజ్‌కుమార్ కూడా తండ్రిని అనుసరించాడు. 1996లో గూడూరులో మొదటిసారిగా యోగా, జిమ్ సెంటర్‌ను ప్రారంభించారు. పట్టణ ప్రజలకు ఆరోగ్యకరమైన శరీరసౌష్టవ సాధన, యోగాల గురించి లోతుగా పరిచయం చేశాడు. తండ్రి, తాతల ప్రభావంతో ద్వారకేష్ కూడా ఇదే రంగంపై మక్కువ పెంచుకున్నాడు. చిన్నతనం నుంచే కఠోర ఆసనాలను సాధన చేయడం ప్రారంభించాడు. శరీరాన్ని ధనుస్సులా వంచేయడం అలవాటు చేసుకున్నాడు. 2006లో చెన్నైలో జరిగిన జాతీయస్థాయి యోగ పోటీలలో ప్రతిభను చాటి బంగారు పతకాన్ని సాధించాడు. పాఠశాల నుంచి అన్ని స్థాయిల్లోనూ నిర్వహించే యోగాసనాల పోటీలలో ప్రతిభ చాటాడు ద్వారకేష్. ఈ క్రమంలోనే గతేడాది చెన్నైలో నిర్వహించిన ఖేలో ఇండియాలో 345 నిమిషాల పాటు శలభాసనం వేసి అబ్బురపరిచాడు. ప్రపంచ గిన్నిస్ బుక్ రికార్డులో స్థానం సాధించగలిగాడు.

ఏమిటీ ఆసనం :

క్రమశిక్షణ, కఠోరసాధన, మనో ధైర్యం, మానసిక సమతుల్యత, ఊపిరి నియంత్రణపై పట్టు ఉంటే తప్ప ఈ తరహా శలభాసన ప్రక్రియలో ఎక్కువసేపు కొనసాగడం కష్టమని యోగా నిపుణులు చెబుతారు. ఈ యోగా భంగిమలో బోర్లా పడుకుని కాళ్లు, ఛాతిని నేల నుంచి పైకి లేపుతూ మిడత ఆకారాన్ని అనుకరిస్తారు. అందుకే దీనిని మిడతాసనం అని కూడా అంటారు. ఈ ఆసనం వెన్నెముక, వీపు కండరాలకు బలాన్నిస్తుందని ద్వారకేష్ చెబుతాడు. జీర్ణ ప్రక్రియ మెరుగుపరచడంలోనూ, పొత్తి కడుపులో పేరుకుపోయే కొవ్వును కరిగించడానికి దోహదపడుతుందంటున్నాడు. అనేక అనారోగ్య సమస్యలను యోగా ద్వారా నయం చేసుకోవచ్చునని అంటున్నాడీ యువకుడు. భవిష్యత్తులో యోగా శిక్షణ సంస్థలను ఏర్పాటు చేసి యువతను యోగాసనాల వైపు నడిపించాలనే లక్ష్యమని ఆంధ్రజ్యోతికి వివరించాడు ద్వారకేష్.


శలభాసనంలో ద్వారకేష్

మల్లికార్జున ప్రయాణం స్ఫూర్తిదాయకం

సత్యవేడు, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి):ఒకప్పుడు శ్రీసిటీలో ఉద్యోగిగా పయనం మొదలుబెట్టి, నేడు పారిశ్రామికవేత్తగా ఎదిగిన మల్లికార్జున ప్రస్థానం యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిదాయకమని వీఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మన్, ఏపీ ప్రభుత్వ మాజీ ఐటీ సలహాదారు, పద్మశ్రీ డాక్టర్ టి.హనుమాన్ చౌదరి కొనియాడారు.శ్రీసిటీలో శుక్రవారం వ్యక్తిగత పరిశుభ్రత ఉత్పత్తులు (శానిటరీ న్యాప్‌కిన్స్) తయారు చేసే స్మైల్ ఎకో ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ ప్రారంభమైంది.హనుమాన్ చౌదరి ముఖ్య అతిథిగా పాల్గొని శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి, స్మైల్ ఎకో మేనేజింగ్ డైరెక్టర్ పరుచూరి మల్లికార్జున సమక్షంలో పరిశ్రమను లాంఛనంగా ప్రారంభించారు. రూ.20 కోట్ల పెట్టుబడితో స్థాపించిన ఈ ప్లాంట్ ఏడాదికి 259.2 మిలియన్ల శానిటరీ న్యాప్‌కిన్‌లను తయారు చేస్తుంది. దాదాపు 200 మందికి పైగా ఉద్యోగాలు లభిస్తాయి. ఇక్కడి ఉత్పత్తులను దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాలకు ఎగుమతులు చేస్తారు. పరిశ్రమ ఎండీ మల్లికార్జునను శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి అభినందించారు. వరదయ్యపాళెం మండలంలోని వెంకటరెడ్డి కండ్రిగకు చెందిన మల్లికార్జున ఒకప్పుడు శ్రీసిటీలో ఉద్యోగిగా పయనం మొదలు బెట్టి, నేడు పారిశ్రామికవేత్తగా ఎదగడం యువతకు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సంతోషదాయకమన్నారు.


పరిశ్రమను ప్రారంభిస్తున్న హనుమాన్ చౌదరి

తిరుమలలో శాస్త్రోక్తంగా చక్రస్నానం

తిరుమల, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): అనంత పద్మనాభవ్రతం సందర్భంగా శనివారం ఉదయం తిరుమల శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంత పద్మనాభవ్రతాన్ని ఏటా భాద్రపద శుక్ల చతుర్దశి రోజున నిర్వహిస్తారు. ఈ సందర్భంగా శ్రీవారి ఆలయంలో ఉదయం పూజలు చేసిన తర్వాత సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి వరాహస్వామి ఆలయం చెంత ఉన్న పుష్కరిణిలో పాలు, పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, చందనంతో విశేషంగా అభిషేకం చేపట్టారు. అనంతరం చక్రస్నానాన్ని ఆగమోక్తంగా నిర్వహించారు. టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి, డిప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

● 35 గ్రాముల బంగారు, 350 గ్రాముల వెండి ఆభరణాల స్వాధీనం

బంగారు వెండి ఆభరణాలతో దొంగ అరెస్టు చూపిస్తున్న గాజుల మండ్యం పోలీసులు →



రేణిగుంట, సెప్టెంబర్ 6 (ఆంధ్రజ్యోతి): రాత్రిపూట ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగ తంగ ముత్తును గాజులమండ్యం పోలీసులు శనివారం అరెస్టు చేశారు. డీఎస్పీ శ్రీనివాసరావు వివరాల మేరకు.. గాజులమండ్యం పోలీస్‌స్టేషన్ పరిధిలో 2021 నుంచి రాత్రిపూట ఇళ్ల తాళాలు పగలగొట్టి చోరీ చేస్తున్న ఘటనలు నమోదయ్యాయి. వేలిముద్రల ఆధారంగా తమిళనాడు రాష్ట్రం తూత్తుకుడి జిల్లా తిరుచెందూరుకు చెందిన తంగముత్తు ఈ చోరీలకు పాల్పడుతున్నట్లు పోలీసులు గుర్తించారు. మరో చోరీకి సన్నద్ధమయ్యే క్రమంలో శనివారం ఉదయం రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద తచ్చాడుతుండగా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 35 గ్రాముల బంగారం, 350 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. కేసును ఛేదించిన గాజులమండ్యం సీఐ మంజునాథ్‌రెడ్డి, ఎస్ఐ సుధాకర్, హెడ్ కానిస్టేబుళ్లు గోపి, రాజేష్, సుబ్రహ్మణ్యం, కానిస్టేబుళ్లు వేణుగోపాల్, గోపి, మణి, మురళి వాసును అభినందించి, రివార్డులు అందజేశామని డీఎస్పీ తెలిపారు.

ఫ్రిక్షన్ ఆధారిత రంగంలో సవాళ్లను అధిగమించాలి

● భావితరాల పరిశోధకులకు ఇన్‌స్పైర్‌గా ఐసీఎఫ్‌పీ సదస్సు ● మిధాని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి

తిరుపతిరూరల్, సెప్టెంబరు6(ఆంధ్రజ్యోతి): ఫ్రిక్షన్ (ఘర్షణ) ఆధారిత ప్రాసెసింగ్ రంగంలో ఎదురయ్యే సవాళ్లను అధిగమించడంలో పరిశోధకులు కీలకపాత్ర పోషించాలని హైదరాబాద్‌కు చెందిన మిధాని మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్‌వీఎస్ నారాయణమూర్తి పేర్కొన్నారు. తిరుపతిలోని ఓల్డ్ తిరుచానూరు రోడ్డులో ఉన్న ఎస్ఆర్ కన్వెన్షన్‌లో ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ప్రాసెసింగ్ ఆఫ్ మెటీరియల్స్ అండ్ ఫ్యాబ్రికేషన్ ఆఫ్ ప్రొడక్ట్స్(ఐఏ-పీఎంఎఫ్‌పీ) ఆధ్వర్యంలో తిరుపతి ఐఐటీ, పాట్నా ఐఐటీ, ఐఐఎస్సీ (బెంగళూరు) సహకారంతో మూడ్రోజుల ఫ్రిక్షన్ బేస్డ్ ఇంటర్నేషనల్ సదస్సు(ఐసీఎఫ్‌పీ-2కే25)ను శనివారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సదస్సుపై రూపొందించిన పుస్తకాన్ని ఐసీఎఫ్‌పీ అధ్యక్షుడు సత్యం సువాస్, బెంగళూరుకు చెందిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రొఫెసర్ సతీష్ వి.కైలాష్, తిరుపతి ఐఐటీ డీన్ ప్రొఫెసర్ అరుణ్‌తంగిరాల, ఐఏ-పీఎంఎఫ్‌పీ అధ్యక్షుడు ప్రొఫెసర్ టీఎస్ శ్రీవాత్సవ్‌లతో కలసి ఆయన ఆవిష్కరించారు. నారాయణమూర్తి మాట్లాడుతూ.. భవిష్యత్ తరాల పరిశోధకులకు ఈ సదస్సు ఇన్‌స్పైర్‌గా ఉంటుందని తెలిపారు. అభివృద్ధి చెందుతున్న ఈ రంగంలో పరిశోధకులు భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు. కాగా ఘర్షణ ఆధారిత తయారీ, స్మార్ట్ మ్యానుఫాక్చరింగ్ తయారీ, సాంకేతికతల అభివృద్ధిపై పలువురు వక్తలు ఉపన్యసించారు. కన్వీనర్‌గా తిరుపతి ఐఐటీ ప్రొఫెసర్ అజయ్‌కుమార్ వ్యవహరించారు. 8దేశాలకు చెందిన అంతర్జాతీయ పరిశోధకులు, పరిశ్రమల ప్రతినిధులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నారాయణమూర్తి, సత్యం సువాస్ తదితరులు

శ్రీసిటీలో చెన్నై ఏంజిల్స్ ప్రతినిధుల బృందం


ప్రతినిధుల బృందంతో శ్రీసిటీ ఎండీ

శ్రీసిటీ, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చెన్నై ఏంజిల్స్‌కు చెందిన 19 మంది ప్రతినిధుల బృందం శనివారం శ్రీసిటీని సందర్శించింది. కె.మహాలింగం నేతృత్వంలోని బృంద సభ్యులకు శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రపంచ శ్రేణి మౌలిక వసతులు, వ్యాపార అనుకూలమైన వ్యవస్థలను వివరించారు. శ్రీసిటీ పర్యటనలో ఉన్న వీఎస్ఎన్ఎల్ మాజీ ఛైర్మన్, పద్మశ్రీ డాక్టర్ హనుమాన్ చౌదరితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. టెలికం రంగంలో అపార అనుభవం ఉన్న చౌదరి, ఆయన అనుభవాలను, పలు సాంకేతిక పురోగతికి సంబంధించిన విషయాలను అడిగి తెలుసుకున్నారు. శ్రీసిటీ పారిశ్రామిక కార్యకలాపాలు, ఇక్కడ అనుసరిస్తున్న పద్ధతులు అధ్యయనం, పెట్టుబడి అవకాశాల పరిశీలన దిశగా బృందం పర్యటన సాగింది. అనంతరం శ్రీసిటీలోని డైకిన్, ఇసుజు, కోల్గేట్, ఎప్సాక్, ఎవర్ ఓల్డ్, సీఈటీసీ తదితర పరిశ్రమలను బృందం సందర్శించింది.

శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ

● నేడు పద్మావతీ అమ్మవారి ఆలయం మూసివేత

తిరుచానూరు, సెప్టెంబరు 6(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయ పవిత్రోత్సవాల్లో భాగంగా శనివారం శాస్త్రోక్తంగా పవిత్ర సమర్పణ జరిగింది. ఉదయం సుప్రభాత సేవతో అమ్మవారిని మేల్కొపి సహస్రనామార్చన, నిత్యార్చన చేపట్టారు. తర్వాత అమ్మవారి మూలమూర్తికి, ఉత్సవర్లకు, ఉపాలయాలకు, పరివార దేవతలకు, విమాన ప్రాకారానికి, ధ్వజస్తంభానికి పవిత్రాలు సమర్పించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు యాగశాలలో ఆరాధన, హోమాలు, నివేదన తదితర వైదిక కార్యక్రమాలు నిర్వహించారు. కాగా, చంద్రగ్రహణంలో భాగంగా అమ్మవారి ఆలయాన్ని ఆదివారం మధ్యాహ్నం 2.15 గంటలకు మూసివేయనున్నారు. తిరిగి సోమవారం వేకువజామున తలుపులు తెరచి, ఆలయ శుద్ధి, సంప్రోక్షణ తర్వాత భక్తులకు అమ్మవారు దర్శన భాగ్యం ఇవ్వనున్నారు.


ఉత్సవమూర్తికి పవిత్రమాలలు సమర్పిస్తున్న అర్చకులు

కారు దగ్ధం



తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మంటలు చెలరేగి కారు దగ్ధమైన ఘటన తిరుపతి మంగళం రోడ్డులో శనివారం రాత్రి చోటు చేసుకుంది. తిరుపతి అగ్నిమాపక దళాధికారి కిరణ్‌కుమార్ రెడ్డి వివరాల మేరకు.. తిరుచానూరుకు చెందిన ఎంబీ కిరణ్ కుటుంబ సభ్యులతో కలసి తిరుపతి మంగళం రోడ్డులోని సురక్ష ఆసుపత్రికి కారులో వస్తున్నారు. ఫ్లైవోవర్ వద్ద వెళుతుండగా ఇంజిన్ వేడెక్కి మంటలు చెలరేగాయి. వెంటనే కారులో ఉన్న వారు కిందకు దిగేశారు. ఆ మార్గంలో వెళుతున్న అలిపిరి సీఐ రాంకిషోర్ తన సిబ్బంది సహాయంతో మంటలను అదుపు చేయడానికి ప్రయత్నించారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా వారు వచ్చి మంటలను అదుపు చేశారు. ఎస్ఐ నాగార్జున రెడ్డి కేసు నమోదు చేశారు.

వెంకటగిరికి చేరిన పర్యావరణ ప్రేమికుడి యాత్ర

వెంకటగిరి, సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ హితం కోరుతూ తమిళనాడు రాష్ట్రం కోయంబత్తూరుకు చెందిన ముత్తు సెల్వన్ చేపట్టిన సైకిల్ యాత్ర శనివారం వెంకటగిరికి చేరింది. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణతో కలిసి ఆయన పట్టణంలోని విశ్వోదయ కాలేజీ గ్రౌండ్‌లో మొక్కలు నాటారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించడం కోసం ముత్తు సెల్వన్ 2021లో సైకిల్ యాత్రను ప్రారంభించి, నాలుగేళ్లుగా కొనసాగిస్తుండటం అభినందనీయమన్నారు. ముత్తు సెల్వన్ మాట్లాడుతూ కరోనా కాలంలో ఆక్సిజన్ కొరతతో జనాలు చనిపోవడం చూసి బయోమెట్రికల్ ఇంజనీరుగా పనిచేస్తున్న తాను విధులకు రాజీనామా చేసి సైకిల్ యాత్ర చేపట్టానన్నారు. పర్యావరణ ప్రాముఖ్యతపై ప్రజలను చైతన్యపరుస్తూ ఎనిమిది దేశాలలో సైకిల్ యాత్ర పూర్తి చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు నేపాల్, బంగ్లాదేశ్‌లో పర్యటన పూర్తయిందని, మన దేశంలో 23 రాష్ట్రాలు, ఏపీలో 10 జిల్లాలు మినహా మిగిలిన ప్రాంతాల్లో యాత్ర పూర్తి చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 1,356 రోజులు 38,600 కిలోమీటర్లు ప్రయాణించినట్లు వెల్లడించారు. 8లక్షల మొక్కలు నాటినట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆయన్ను సత్కరించి, ఆర్థిక సాయం అందించారు.


ఎమ్మెల్యేతో కలిసి మొక్కనాటుతున్న పర్యావరణ ప్రేమికుడు ముత్తు సెల్వన్

ఉపాధి బకాయిలు రూ.50.20కోట్లు

● 16 వారాలుగా కూలీలకు అందని వేతనాలు

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మే నుంచి ఇప్పటివరకు రూ.50.20 కోట్లు బకాయిలు పేరుకుపోయాయి. మెటీరియల్ కాంపోనెంట్(సీసీరోడ్లు, డ్రైన్లు, గోకులాలు వంటి అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి) కింద రూ.70 కోట్లు రావాల్సి ఉంది. గడచిన నాలుగు నెలలు(16 వారాలు)గా కూలీలకు బిల్లులు సరిగా ఇవ్వడం లేదు. ఈ కారణంతో పనులకు వచ్చే కూలీల సంఖ్య క్రమంగా తగ్గిపోతోంది. జిల్లాలోని 774 పంచాయతీల్లో ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 53 లక్షల పనిదినాలు పూర్తయ్యాయి. మరో 8 నెలల్లో 50 లక్షల పనిదినాలు పూర్తి కావాల్సి ఉంది. బిల్లులు రాకపోవడంతో కుటుంబం గడవటం కష్టమవుతోందని, ప్రతివారమూ ఖాతాల్లో జమయ్యేలా చర్యలు తీసుకోవాలని కూలీలు కోరుతున్నారు.

త్వరలోనే బకాయిలు చెల్లిస్తాం

● శ్రీనివాసప్రసాద్, డ్వామా పీడీ

ఉపాధి హామీ పథకం కూలీలకు త్వరలోనే వారి ఖాతాకు బకాయిలు జమచేస్తాం. ఈ సమస్య రాష్ట్రవ్యాప్తంగా ఉంది. జిల్లాలో 16 వారాలకు సంబంధించి 1.71లక్షల మంది కూలీలకు రూ.50కోట్లపైగా బకాయిలు చెల్లించాల్సి ఉంది. గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన కోసం చేసిన అభివృద్ధి పనులకు మరో రూ.70కోట్లు రావాల్సి ఉంది.